# హ్యూమన్ డిజాస్టర్

నవలిక

- డా. వెల్చేరు చంద్రశేఖర్



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 163

*కౌముది మాసపత్రికలో*

*జనవరి 2016 సంచిక నుంచి మే 2016 సంచిక వరకూ వచ్చిన*

# హ్యూమన్ డిజాస్టర్

# (ప్రారంభం)

ఆ రోజు జాన్యువరి 26, యాభైరెండవ రిపబ్లిక్ దినోత్సవం.

దేశం మేల్కొని సంబరాలు జరుపుకోడానికి సిద్ధమవుతోంది. కొన్నిచోట్ల సంబరాలు మొదలయ్యాయి, ఆ రోజు శలవు కూడా!

ప్రజాజీవితంలో వో అలసట, బద్ధకం వుంటాయి. కానీ పిల్లలు అలా కాదు, శలవంటె వుత్సాహం ....ఆట ...అదో సరదా ...

అయితే భూమిపై మన సంకల్పాలకి భిన్నంగా, ఎక్కడో తలాతలాల్లో సంకల్పం ఇంకోలావుంది. ఈ భూమి గురించి అనేక సిద్ధాంతాలు వున్నయ్.

ఎందుకంటే మనం పెద్దమంచుముక్కల మీద తేలియాడుతున్నాం, లేదా మనం గ్రీజు మీద తేలియాడుతున్నాం. అందులో ఇండియన్ కాంటినెంట్ ఏడాదికి 5 సెం.మీ. చొప్పున వుత్తరానికి పాకుతోంది. అందుకే హిమాలయాలు పెరుగుతున్నాయి.

ఈ భూమి ఓ గుడ్డులాంటిది. దాని పచ్చసోన కరిగి మరుగుతున్న, "మోల్టెన్ మాగ్మా" అయితే, తెల్లసోనని ఎర్త్ మేంటెల్ అంటారు. చాలా దృఢంగా గట్టిగా వున్న తెల్లటి పెంకుమందం 30కిలోమీటర్ల మందం మాత్రమే. భూమి వుపరితలం నుండి మధ్యభాగానికి 6400కిలోమీటర్లదూరం అయితే, కేవలం 30కిలోమీటర్ల మదంగల గట్టిభూమి మీద మన జీవిస్తున్నాం....... !

ప్రమాదం ఈనాడు జరగలేదు. మూడువేలలక్షల సంవత్సరాల క్రితం మొదలైంది. ఇండియన్ కాంటినెంట్ గాండ్యానా లేండ్ నుండి విడి ఉత్తరంగా ఏడాదికి 7సెం.మీః చొప్పున ప్రయాణించి యూరోఏషియా, చైనా కాంటినెంట్స్ తో కలిసింది. ఆ ప్రక్రియలోనే హిమాలయాలు ఏర్పడ్డాయి అంటారు.

ఈ ప్రక్రియ ఎంత నెమ్మదిగా జరిగిందంటే..... హైడ్రాలిక్ ష్టాపర్ పెట్టిన గది తలుపు ఎంత నెమ్మదిగా మూసుకుంటుందో అంత నెమ్మదిగా రాతిపలకల దొంతర కదులుతోంది.

ఈ కదలికలో వొత్తిడి ఎక్కువైతే ఈ పలకలు వొంగుతున్నాయి. పక్కకి జరుపుతున్నాయి. ఈ రకంగా పెద్దపెద్దపగుళ్ళు తేరుతున్నాయి.

హిమాలయాల్లో జరుగుతున్న మార్పులు గమనిస్తే ఒక భూకంపంలో 30కి.మీ. రాతిపొర మెల్లిగా జరిగింది. దాని ప్రకంపనలు, నీటిలోరాయి విసరినప్పుడు. అలలు వచ్చినట్టు, కొంత సేపటివరకూ భూమిమీద ప్రభావం చూపాయి. ఇలా జరిగినప్పుడు విపరీతమైన శక్తి వెలువడుతుంది. ఆ శక్తి 2.50.లక్షల టన్నుల టి.న్.టి.కి సమానం అవుతుంది.

దీని ప్రభావం వందకిలోమీటర్ల వరకూ వుంటుంది. అయితే రాయిపడి, అలలుగా బయలుదేరాక ఆ శక్తి వ్యాపించి భూమిమీద సృష్టించే విధ్వంసం నమ్మరానిదిగా వుంటుంది. ఈ రాయి పడ్డచోటుని, ఎపి సెంటర్, అంటారు. దాన్ని ముందుగా తెలుసుకోవాలి. (ఇండియాని 5 భాగాలుగా విభజించారు. అందులో జోన్ అయిదు ఈ ప్రాంతాల్లో భూకంపం గాఢంగా వుంటుంది. భూకంపం వచ్చే అవకాశం ఎక్కువగా వుంటుంది. అది రిక్టర్ స్కేలు మీద 9 దాటి వుండచ్చు., అంటే భూమిలో ఎక్కడో 10 మీటర్లకన్నా ఎక్కువ, (స్లిప్)జరిగి వుండచ్చు. భూకంపం ప్రభావ తీవ్రత హెచ్చుగా వుంటుంది. ఈ ప్రాంతాలు గుజరాత్లొ భుజ్, అస్సాం, దిస్ పూర్, షిల్లాంగ్, నార్త్ ఈష్టన్

స్టేట్స్ లో మొదలైనవి. ఇక జోన్–4 కేటగిరిలోకి గుజరాత్ లో అహమ్మాదాబాద్, కాశ్మీర్ మొత్తంగా, డార్జిలింగ్ మొదలైనవి. ఆ రకంగా మిగతా....మూడు జోన్లు.)

ఈ భూకంపాన్ని ముందుగా తెలుసుకోగలమా, ఇది ఈనాటి మేధో ప్రపంచాన్ని కుదుపేస్తున్న ప్రశ్న. ఎక్కడ సైన్సు మీద ప్రజలకి నమ్మకం పోతుందో అని ఏదో వివరణలు. ఆ వివరణలు ఎప్పుడూ నిరాశావాదంతో కూడుకునే వుంటాయి ఆశావాదంతో కూడుకున్నవి చాలా విచిత్రంగా వుంటాయి.

భూకంపం వచ్చినప్పుడు లేదా భూమి కంపించేటప్పుడు మనకి కొన్ని సంకేతాలిస్తుంది. అవి మనం పట్టించుకోం. అవి పట్టించుకోడానికి మన దగ్గర టైముండదు. కానీ కొన్ని జంతువులు ముందుగా భూకంపాన్ని పసికడతాయి, వాటిని మనం పట్టించుకోము, ఎందుకంటే అవి మనకంటే తెలివి తక్కువవి అనుకుంటాం. భూకంపం వచ్చినప్పుడు, జంతువులు, పాకిరేజంతువులు, పాములు, బల్లులు, అవే కాదు బొద్దింకలు, ఏనుగులు అసహనానికి గురౌతాయి. విచిత్రంగా ప్రవర్తిస్తాయి. ఈ మధ్య చీమలకి భూకంపం ఇరవైనాలుగుగంటలు ముందు తెలుస్తుందన్న పరిశోధన బైటపెట్టారు...

ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం వుందో టి.విలో వస్తున్న ఈప్రసారాన్ని సమాచారాన్ని చాలా జాగ్రత్తగా వింటున్నాడు విధాత, అప్పటికే దంతికి, కేతకికి ఫోనువెళ్ళింది. వాళ్ళు వస్తున్నానన్నారు. నాగు దగ్గర్నించి ఫోను వచ్చేసింది. చేతినిండా పని దొరికింది వస్తున్నానన్నాడు. ముగ్గురూ రూముకి చేరగానే నాగు అడిగిన మొదటి ప్రశ్న, "ఎపి సెంటర్ ఎక్కడ?" అని.....

''ఇంకా తెలియదు,''

''అదేమిటి''

''న్యూఢిల్లీలో వాళ్ళు ఏమీ ఎనౌన్స్ చెయ్యలేదు.''

''అహమ్మదాబాద్ లో అన్ని కమ్యూనికేషన్స్ పాడయివుంటాయు.''

''బిబిసి పెట్టు,'' అన్నాడు నాగు.

అది మనకెందుకు మనం అహమ్మదాబాదు వెళ్ళేసరికి, పేపర్లో అన్ని వార్తలు వచ్చేస్తాయి. అన్నాడు విధాత, నలుగురూ కావలసిన వన్నీ సర్దుకున్నారు. ఎయిర్ పోర్టుకి బయలుదేరారు.

--------0---------

పెద్ద రైలు కూత... కాదు రైలుపట్టాలమీద ఆగిన కీచుశబ్దం.. ఆ కీచుశబ్దానికి హద్దుల్లేవు, తర్వాత రోర్, ఇంటిని పట్టుకు వూపేస్తున్నారు. పైనుండి... పెల్లలు పడుతున్నాయి. ఏమైంది. ఇల్లు కూలిపోతోందా? "స్వీటీ.. కిట్టూ" అంటూ పరిగెట్టింది మాధవి. "యావండీ.." అంటూ అరచింది. గబగబా నడవబోయి నడవక్కరలేకుండా జారిపడిపోయింది. ఎక్కడికి జారింది ఏమిటో తెలయడంలే... జారింది అంతే! ఎదురుగా వీధి కనిపించింది. తను వీధిలోకి వెళ్ళిపోవాలని లేచి నిలబడబోయింది. కాని నిలబడలేక జర్రునజారి పడింది. కాలిమీద ఏదో బరువుగా పడింది. పటుక్కున కాలు విరిగింది. ఇంకేం లేస్తుంది. అప్పుడే పక్కనున్న గోడ ఇటుకలు మీద పడ్డాయి. భయంతో మీదపడ్డ ఇటుకల్ని పక్కకి తోసింది. పక్కగా ఇటికల గుట్ట మళ్ళీ కీచుమన్న శబ్దం ఈసారి పళుక్కున విరిగిన చప్పుడు... నెత్తిమీద శ్లాబు కిందపడింది. తను చచ్చిపోయిందా, తను పచ్చడయిందా, కాలుకదపడానికి లేదు... దాని మీద ఇంకా బరువు ఎక్కువైపోయింది లోపలంతా చీకటి ఇంతకు ముందు కనిపించిన వెలుతురు వీధి కనిపించడంలేదు. ఏమైపోయాయి? పైన పడ్డ, కాంక్రీటు శ్లాబు పూర్తిగా దిగగలదు. దిగకుండా ఇటుకలగుట్ట .. ఆధారంగా వున్నాయి.

ఆ శ్లాబు పడ్డప్పుడు, "అమ్మో..!" అన్న కీచుకేక వినబడింది. దానితో, ఏడుపు, అరుపులు వినిపిస్తున్నాయి. "హల్లో ఎవరైనా రక్షించండి. కాలు విరిగిపోయింది... దాహం వేస్తోంది..." అంటూ అరుస్తున్న ధనిదాస్, పక్కనున్న ఇంటిలో వుంటాడు. ఎంత గట్టిగా అరుస్తున్నాడో ఎవరేనా వస్తారా? ఎవరున్నారు? ఇంతరాత్రివేళ ఇందాకటి వెలుగు ఎక్కడా కనబడ్డంలేదు. వొక చెయ్యి బైటనేవుండిపోయింది. ఇరుక్కుపోయింది. ధనిదాస్లా తను అరవాలా మాధవి తేల్చుకోలేకపోతోంది. వొకసారి అరచి చూసింది... తన అరుపు తనకే వినిపించింది. అరవడం దండగ చచ్చిపోతానా చచ్చిపోతే శ్లాబు పడగానే చచ్చిపోవాలి. కానీ చచ్చిపోలేదు. నలిగిపోలేదు. కాలిమీద పడ్డ ఇటుకల్ని తొలగించ లేదు కాలు విరిగింది నొప్పిలేదు... వున్నా తెలయడంలేదు... చెయ్యి రావడంలేదు., ధనిదాసే, అరవడం మానలేదు. కానీ ఇందాకట్లా అరవడంలేదు. అరుపుకీ అరుపుకీ మధ్య కాసేపు మౌనంగా వుంటున్నాడు. నోరెండిపోతున్నట్టుంది... మళ్ళీ ఆశ అరుస్తున్నాడు. మాధవికి ఏం చెయ్యాలో తెలియడంలేదు... చిన్నప్పుడు నాన్న నేర్పించిన మృత్యుంజయమంత్రం చదవడం మొదలుపెట్టింది. కళ్ళు మూసుకుంది... మృత్యుంజయ మంత్రం చదువుతోంది. మగతకమ్మేసింది. నిద్రొచ్చేసింది.

మళ్ళీ తెలివొచ్చేసరికి ఇందాకటి వాతావరణానికి ఇప్పటికీ తేడా తెలుస్తోంది. ఏదో వేడి... కళ్ళకి చీకటే, టైమెంతయిందో స్వీటీ, కిట్టూ స్కూలుకెళ్ళారా, ఆయన ఆఫీసుకెళ్ళారా. ఎన్నాళ్ళిలా, ఏమిటీ బతుకు తనెందుకు చచ్చిపోలేదు... మృత్యుంజయ మంత్రం జ్ఞాపకం వచ్చింది. చదువుతోంది. ఆ మంత్రం వేడా కాదు సూర్యుడు ఎండ మండించేస్తున్నాడు... లోపల వేడిగా వుంది. శ్లాబు వేడెక్కిపోయింది. ఒక్కనిముషంలో తప్పిపోయింది. లేకపోతే వీధిలోకి పారిపోవలసిందే. భూకంపం వచ్చేవుంటుంది... అన్నిళ్ళు కూలిపోయివుంటాయి. ధనీదాస్ ఇంకా అరుస్తున్నాడు. కాని అంతగట్టిగా కాదు. గొంతు కీచుగా వచ్చేస్తోంది.

గాలి లేచినట్టుంది. కన్నాల్లోంచి దుమ్ము వస్తోంది. ఏం చెయ్యగలదు. వొకచెయ్యి దగ్గరే వున్నా తీసుకోడానికి చోటులేదు.

రెండో చెయ్యి భుజంమీద ఇటుకలు పడ్డాయి. చెయ్యి నొక్కుకుపోయింది. చెయ్యంతా బయటే వుండిపోయింది. ధూళి కళ్ళల్లోకి రాకుండా కళ్ళుమూసుకుంది. కానీ ముక్కు మూసుకోడం కుదర్లేదు. కాసేపు వూపిరి ఆపింది. కానీ ఎంతసేపు, గాలి పీల్చక తప్పలేదు. పీల్చింది. ముక్కులోవున్న ధూళి గొంతులోకి వచ్చింది... గొట్రుపోయి దగ్గు... దగ్గాలంటే రొమ్ములు వీపు మజిల్స్ కదలాలి దగ్గబోయింది... దగ్గలేకపోయింది... దగ్గు అదోసౌండ్ గా వచ్చేసింది. కానీ గొంతులో గొట్రుపోలేదు. తను కదల్లేదు బతికుంది. అంతే ఎన్నాళ్ళు బతికుంటుంది. తెలీదు ఎవరేనా వస్తారా, తెలీదు. మృత్యుంజయమంత్రం జ్ఞాపకం వచ్చి చదవడం మొదలుపెట్టింది. పైనున్న శ్లాబు నిప్పులా తయారైంది. తప్పించుకోడం ఎలా, నిప్పులో కాలాల్సిందే. వేడిగా గాలి, వేడెక్కిన పెనాలుమీద పెట్టినట్టుంది. వేడికి తట్టుకోలేక మగత కమ్మేసింది. నిద్రపోయింది.

తెలివివొచ్చేసరికి వేడితగ్గింది. నోరార్చుకుపోయింది. ఏవీ నీళ్ళు... ఏం చెయ్యాలి మెల్లిగా చీకటి పడుతోందని అర్థం అయింది. ధనీదాస్ అరుపులు ఆగిపోయాయి. చచ్చిపోయాడా, అరవలేకశోషొచ్చి పడిపోయాడా, వెర్రివాడు ఎందుకు అరిచాడు. అందరూ తనలాగే ఎక్కడో ఇరుక్కుపోయుంటారని తెలియదా?

ఆశ ఎవరేనా వచ్చి చచ్చీచావని స్థితినుండి తప్పిస్తారని ఆశ....! మళ్ళీ మృత్యుంజయమంత్రం జ్ఞాపకం వచ్చింది. చదువుతోంది. కదలడానికి లేదు. ఆకలి తెలియడంలేదు. నీరసం రావడంలేదు. ఇదంతా మృత్యుంజయమంత్రం ప్రభావమేనా? కాదా, ఆకలి చచ్చిపోయింది. ఆకలితీరుతుందని తెలిస్తే ఆకలి వేస్తుంది. దాహం వేస్తుంది. నీరసంగా వుందోలేదో ఎలా తెలుస్తుంది. మళ్ళీ మృత్యుజయమంత్రం మగత...నిద్ర..

ఎంతసేపు మగత కమ్మిందో తెలియడంలేదు. తెలివొచ్చేసరికి తెల్లారిందని తెలిసింది. ఎండవిపరీతంగా వుంది... లోపల వేడెక్కుతోంది. మృత్యుంజయమంత్రం చదువుతోంది. దాన్ని బ్రేక్ వేస్తూ ఎక్కడో అలికిడి ... ఎవరో కదులుతున్నారు. ఎవరో వస్తున్నారా, ప్రపంచానికి భూకంపం గురించి తెలిసిందా, రక్షించడానికి వస్తున్నారా ఆశ... శక్తి కూడకట్టుకు గట్టిగా అరిచింది. "కాపాడండీ" అంటూ..., మూడుసార్లు అరిచింది.

ఆ అరుపుకి కదలిక ఆగింది. కాని కొద్ది సేపటి వరకూ కదలిక, మాటలు వినపడలేదు.

కదలిక మొదలైంది..., దాన్ని బట్టి ఎవరో తన వేపే వస్తున్నారు, తెలుస్తోంది. తన దగ్గరగా వచ్చేసారు. చెయ్యిపట్టుకున్నారు. మాటలు లేవు. కలకలంలేదు. చెయ్యిపిసుకుతున్నారు. ఎందుకు, అప్పుడు జ్ఞాపకం వచ్చింది. చేతికి నాలుగుజతల బంగారుగాజులున్నాయి. అవి తీస్తున్నారా? అవి వుంటేనేం తీస్తేనేం...!

మళ్ళీ అలికిడి లేదు. ఎవరూ రాలేదు కాపాడడానికి రావడం లేదు. మరి వచ్చిందెవరు? ఈ ఆలోచన్లు వృధా, మృత్యుంజయమంత్రం చదవడం మొదలుపెట్టింది. మగత...నిద్ర ...వేడి.. చీకటిపడింది. ఇంకా ఎన్నాళ్ళు.... ఎవరూ పైప్రపంచంలో బతికిలేరు. ఇక్కడి ప్రజలని పట్టించుకోదా ప్రభుత్వం!

భూకంపం వచ్చి ఇది మూడోరోజు..., ఇంతవరకూ ఎవరికీ తెలీదా? ప్రభుత్వం ఏం చేస్తోంది? అసలుందా, ప్రపంచం బ్రతికున్నవాళ్ళను ఎందుకు పట్టించుకోడం లేదు. (నిద్రలో ఎప్పుడు అయిపోయిందో యూరిన్ పాసయింది. చీరంతా తడిసిపోయింది)యూరిన్ కి తడిసిన చీర ఆరింది కానీ కంపుకొడ్తోంది. ఇంక ఎన్నాళ్ళిలా? బతుకుతుందా?. తనని ఎవరూ గుర్తించి కాపాడరా?, తనిలా చచ్చిపోతుందా?, మగత కమ్మేసింది. నిద్రలో ఎవరో వచ్చారు. కలకలం ఆ చుట్టూ మనుషులు తనని తగల బెడుతున్నారు. అకస్మాత్తుగా తెలివొచ్చింది. నిజంగానే కలకలం .......వెలుగొస్తోంది.

ఎవరో ఓ ఇటుక తీసారు. ఇటుకలు తీస్తున్నారు. చిన్న కన్నం ఏర్పడింది. ఎవరైనా బతికున్నారా? ''హలో'' అంటూ కేక...

ఆశ ఆనందం అన్నీ కూడేసుకు, 'కాపాడండి', అని అరిచింది మాధవి. అప్పటికి భూకంపం వచ్చి 72 గంటలు అయింది.

* * *

దంతి, విధాత వీధుల్లో నడుస్తున్నారు. అన్ని చోట్లా కూలిన భవనాలు గుట్టలు, భవనాలకింద వేలాడుతున్న కాళ్ళు, చేతులు, చితికినబుర్రలు, పచ్చడైపోయిన చిన్నపిల్లలు, ఇది రెండోరోజు ఇంకా ప్రభుత్వం తేరుకోలేదు. సహాయానికి రాలేదు. అక్కడక్కడ వొకళ్ళిద్దరు వున్నా ఆ కూలిపోయిన బరువాటి కాంక్రీటుశ్లాబులు, దూలాలు ఎలా తొలగించాలో తెలీక ఏడుస్తున్నారు.

నిర్మానుషంగా వున్న వీధులు ఎంచుకుని బైటికి కనిపించిన చేతులకి వున్న గాజులు కాళ్ళపట్టీలు తీసి భద్రంచేసుకుంటూ..., ఆ వీధిలో నడుస్తున్నారు. వీధిలో అడ్డగావున్న గుట్ట మీదఎక్కి అన్నీ చూసుకు గుట్ట దిగుతుంటే.........,

''వొరేయ్ పటేల్ ఏం చేస్తున్నావురా కాపాడ్రా'' అన్నఫీక్ వాయిస్ వినిపించింది.

" ఎవడీ పటేల్?" అనడిగాడు విధాత.

"ముఖ్యమంత్రి" దంతి జవాబు.

వీధి నిర్మానుషంగా వుంది. ఇళ్ళు మంచివే రెండుమూడు ఎపార్టుమెంటులు కూడా కూలిపోయాయి. వో ఎపార్టుమెంటు కూలి పక్కనున్న భవనం మీద పడింది. అందులోంచే ఈ అరుపు వినిపిస్తోంది. ఆ కూలిన ఇంటిముందు నిలబడి అరుపుకోసం విన్నారు. ఆ ఇంటిలోంచే అరుపు సందేహంలేదు. కాని ఇంటిముందు ఇటుకల గుట్ట కాక్రీటుస్థంభాల ముక్కలు ఇల్లు లోపలి భాగం, పూర్తిగా నేలమట్టం

అవలేదు. అవకుండా ఈ స్థంభాలే అడ్డుగా వున్నాయి. కానీ ముందునించి కానీ పక్కనుండి కానీ వెళ్ళడానికి లేదు. విధాత గుట్టమీదకెక్కాడు. స్థంభాలమీద పాకురుకుంటూ గుట్టెక్కాడు. ఎక్కడా వెళ్ళడానికి దారి లేదు. కానీ అరుపు స్పష్టంగా వినబడింది,. ఎక్కడనించి వస్తుందో తెలియలేదు. మరింత గుట్టెక్కాడు, గుట్టజారుతుందేమో అన్న భయం, దంతి దగ్గర తాడు తీసుకు గుట్టపై అడ్డగా పడున్న దూలానికి వేసి లాగి చూసాడు. గాలం గట్టిగా పట్టింది. దాన్ని పట్టుకు గుట్టెక్కాడు. అక్కడ కూడా ఇటుకలు స్లిప్ అయి, తను స్లిప్ అవకుండా చూసుకున్నాడు. అలా ఇరవైఅడుగులు ఎక్కింతర్వాత అక్కడ దూలాలు మాత్రమే అడ్డదిడ్డంగా పడ్డాయి. మంటేసుకోడానికి కర్రలు పేర్చినట్టున్నాయి. దూలాలు అలాపడ్డం వల్ల కింద శ్లాబు క్రష్ అయిపోయింది. కానీ పూర్తిగా కూలిపోలేదు.

కూలిపోయిన శ్లాబు కూలిపోయిన గోడలు ఈ దూలాల్ని సపోర్టు చేస్తున్నాయి. అక్కడ అరుపు స్పష్టంగా వినబడింది. తాడుని తీసి దూలాలమధ్య దూరి మెల్లగా కిందకి దిగేడు. ఎనిమిది అడుగులు దిగిం తర్వాత శ్లాబుకి పెద్దకన్నం కనబడింది.

శ్లాబులోపల చిన్న మినుకుమినుకుమంటూ వెలుగు కనిపించింది. అక్కడ్నించే అరుపు, ఈ సారి పెద్దగా వినిపించింది ఆ ఇంటిమీద పక్క అపార్టుమెంటు వరండా బీములు స్థంభాలు అన్నీపడి ఈ ఇంటిని క్రష్ చేసాయి. వీడెలాగో బతికాడు.

విధాత శ్లాబు మీదకి దిగి గదిలోకి దిగగలనో లేదో చూసాడు. గదిలోకి అతికష్టం మీద దిగగలడు. స్లాబులో అస్తవ్యస్తంగా వున్న వూసల్ని వంచి లోపలికి జారేడు. అప్పుడు చూసాడు. లోపల పిచ్చాడిలా వున్న వ్యక్తిని అర్బకుడిగా లేడు కానీ పర్వాలేదు. రెండ్రోజులు మానసికక్షోభ అతన్ని క్రుంగదీసింది. ఆ గది వొక పక్క కూలిపోయింది. గదికి మధ్య దూలం పక్కగా వొరగడం వల్ల స్లాబు రెండుపక్కల గోడలు మాత్రం కూలడం వల్ల స్లాబు వొరిగి గది ఇన్ టాక్ట్ గానే వుంది. విధాత గదిలోకి దిగ్గానే, అతను ఆనందపడ్డాడు. 'నేను బతుకుతాను, నేను బతుకుతాను,' అంటూ--గెంతులేసాడు. అంతలోనే భోరున ఏడవడం మొదలుపెట్టాడు. అలా ఏడుస్తూనే వున్నాడు.

విధాత ఆ గదిలో ఏమిటి పనికి వస్తాయో చూసాడు. అతని కళ్ళఎదుట గదిలో టేబులు మీద డబ్బు ఒకటా రెండా అయిందొందల నోట్లు. ఆరుకట్టలు కట్టిఉన్నాయి. వందనోట్లో రెండు కట్టలు కట్టి వున్నాయి. గదిలో చిన్న కొవ్వొత్తి వెలుగుతోంది. అదే టేబులుమీద గ్లాసులో పచ్చగా గ్లాసు సగం వరకూ వుంది. అది మందేమో అనుకున్నాడు.....విధాత వీడు మందుకొడుతూ డబ్బు లెక్కపెట్టుకున్నాడు.

ఆ గదికి పక్కగదులు పూర్తిగా కూలిపోయాయి. అందులో ఎవరూ బతకడానికి ఆస్కారం లేదు. వీడెలాబతికాడో వీడదృష్టమో లేక దురదృష్టమో, విధాత దృష్టి డబ్బుమీద పడ్డం గమనించాడు అతను,

"నా పేరు యశ్వంత్" అంటూ మొదలుపెట్టాడు.

"నాకు వర్ధమాన్ నగర్ లో పెద్దషాపుంది. ఆ రోజు రాత్రి షాపులో విపరీతంగా రష్, రాత్రి పదయింది. షాపు కట్టేసరికి డబ్బు మర్నాడు గాని బేంక్ కి కట్టడానికి లేదు. ఇంటికి తీసుకొచ్చేసాను. నా భార్య తలుపు తీసి టేబులుమీద భోజనం పెట్టాతినండి. అంది, అలాగే అని టేబులుమీద భోజనం చేసాను. డబ్బుని నారూముకి తీసుకొచ్చి లెక్కపెట్టి డ్రాయర్లో పెట్టాను. మర్నాడు ఏడుగంటలకి లేచి తయారై నాస్తా చేసే ముందు గదిలోకి వెళ్ళి డబ్బు తీసి కట్టలుగా కడుతున్నాను. ఆరు కట్టలు కట్టి టేబులుమీద పెట్టి కాగితం తీసి నోట్ చేసుకుంటున్నాను. అప్పుడు గదిలో ఫేనాగిపోయింది. ఆ రోజు జాన్యువరి 26 రిపబ్లిక్ డే పిల్లలు వాళ్ళగదుల్లో తయారవుతున్నారు. పెద్ద శబ్దం ఏం జరుగుతోందో తెలీలేదు. అరుపుల్లేవు, నా భవనం కూలిపోయింది. అన్ని చోట్లనుండి కూలిపోయింది. అసలు ఇల్లే లేదు. ఈ గది సగం కూలివూరుకుంది. నాకు తెలుసు అవతల గదిలో పిల్లలు, నా భార్య అలికిడి లేదు. మొత్తంగా ఇల్లు కూలిపోయింది. వాళ్ళు చచ్చిపోయుంటారు. అని అర్థం అవుతోంది. ఏం చెయ్యాలి? ఇల్లు పూర్తిగా కూలిపోతుంది. అని ఎదురుచూడాలా, చూసాను కానీ ఇల్లు కూలిపోలేదు. సమయం గడుస్తున్న. కొద్దీ నిశ్శబ్ధం... మొత్తం వూరు కూలిపోయింది. లేకపోతే ఏదో అలికిడి అయేది.

ఆ నేలమీద పడుకుని, డబ్బులు లెక్కపెట్టి సమయం గడిపాను. మధ్యాహ్నం ఆకలి వేసింది. కాసేపటికి ఆకలిపోయింది. దాహంవేసి దాహం వేస్తూనే వుంది. నోరార్చుకు పోతోంది. ఎక్కిళ్ళు వస్తున్నాయి. ఏం చెయ్యాలి. నీళ్ళెక్కడ దొరుకుతాయి. దేనికేనా ఆగగలమేమో గాని దాహానికి తట్టుకోడం కష్టం. ఏం చెయ్యాలి. ఎక్కిళ్ళు ఆగడంలేదు. టేబులు మీద గ్లాసు తీసాను. యూరిన్ పట్టాను. అది కొంచెం పట్టాను. అది నీరె మురార్జీదేశాయ్ ఎలా, తాగేవాడు తనెందుకు తాగలేకపోతున్నాడు. గ్లాసు ఎత్తి తాగేదు... దాహం తీరిందో లేదో తెలీదు కానీ... ఎక్కిళ్ళు ఆగిపోయాయి. నోరంతా ఏదో పట్టేసినట్టయింది. మిగతా యూరిన్ ఆ టేబులు మీద ఉంది.''

విధాత అతను చెప్పిందల్లా వింటున్నాడు. దంతి అరుపు వినిపించింది. "ఏం చేస్తున్నావ్?" అంటూ... విధాత ఇంక ఆలస్యం చెయ్యలేదు. టేబులు మీద డబ్బు సంచిలో సర్దేసాడు . అతను ఏమనలేదు. తాడువేపు నడిచాడు. యశ్వంత్ విధాత కాళ్ళు పట్టుకున్నాడు " నన్ను రక్షించు. నీతో తీసుకుపో" అంటూ, విధాత వినిపించుకోలేదు. తాడు పట్టుకు ఎగబాకాడు. రెండుమూడు ముళ్ళపైకి ఎక్కాడో లేదో కింద యశ్వంత్ తాడు పట్టుకు పైకి లేచాడు. దాంతో తాడు వూగి విధాత తలపక్కనే వున్న దూలానికి తగిలి బొప్పి కట్టింది.

విధాతకి నిలువునా కోపం ముంచుకొచ్చింది. గబగబా కిందకి దిగి. తాడుపట్టుకున్న యశ్వంత్ ని కాలితోతన్నాడు. యశ్వంత్ కిందపడిపోయాడు. తన మూడులక్షలు తీసుకున్నాడు. తనని కాలితో ఎందుకు? తన్నాడు. అని ఆలోచించలేదు." ప్లీజ్ నన్ను రక్షించు" అంటూ ప్రాధేయపడ్డాడు, కాళ్ళుపట్టుకున్నాడు.

చికాగ్గా కాళ్ళు విడిపించుకున్నాడు. యశ్వంత్ ని వోమూలకూర్చో అని సైగచేసాడు యశ్వంత్ విన్లేదు. అప్పుడో లెంపకాయ కొట్టాడు. చేతులు పట్టుకు బరబరా ఈడ్చి వోమూల కుదేశాడు. వెనకాల వస్తే పొడిచేస్తాను అన్నట్టు కత్తి తీసి చూపించాడు.

యశ్వంత్ నివ్వెరపోయి చూస్తున్నాడు. మూలనుండి లేచే వోపిక కూడా లేదు. అక్కడే గోడకానుకుని విధాతని చూస్తున్నాడు. విధాత తాడు దగ్గరకెళ్ళి దూలాల మధ్య మాయమయ్యాడు.

యశ్వంత్ కి బతుకుతానన్న ఆశ పోయింది. అయినా ఎవరికోసం బతకాలి, బతకి ఏంచెయ్యాలి. తన షాపు వుందన్న నమ్మకం లేదు. తనీ ఇల్లు ఎలా కట్ట గలదు ఈ నడివయసులో మళ్ళీ జీవితం ఎలా ప్రారంభించాలి, వొంటరిగా ఈ బ్రతుకెందుకు? అసలు తనెందుకు చచ్చిపోలేదు. గట్టిగా ఏదూలమో కదిలి అన్నీ మీదపడితే చచ్చిపోడా, మూలనుండి లేచి విధాత వెళ్ళిన కన్నం దగ్గరకి వచ్చాడు. తాడు అక్కడే వుంది. విధాత పైకి వెళ్ళడం లేదు. కిందకి దిగుతున్నాడు. ఎందుకు?

తనని చంపేసి పోతాడా పోనీ అలా చేసినా బావుద్ను కానీ కత్తితో పొడిస్తే బాధకలుగుతుందేమో, మృత్యువు అనుకోకుండానే వస్తేనే బెటర్. ఇలాంటి మృత్యువు భయం కలిగిస్తుంది. కత్తితో చావకూడదు. యశ్వంత్ ఆలోచనల్లో వుండగానే విధాత కిందకి దిగాడు.

'' వొద్దు చంపకు తాడు పట్టుకోడానికి రాలేదు.'' అన్నాడు ఏడుస్తూ ఇందాక ఏదో దూలంలాగి చద్దాం అనుకున్నవాడు ఏలాగైనా చద్దాం అనుకున్నవాడు ఇప్పుడు చంపద్దు అని ఎందుకు ప్రాధేయపడుతున్నాడు.

విధాత యశ్వంత్ ని దీర్ఘంగా చూసాడు. ఇందాకల యశ్వంత్ ని ఈడ్చి కూర్చోబెట్టిన మూల చూపించాడు. యశ్వంత్ భయపడుతూనే ఆ మూలకెళ్ళి కూర్చున్నాడు. విధాత వీపునున్న బేగ్ లోంచి వోనీళ్ళబాటిలు, వో పేకెట్టు తీసి యశ్వంత్ కి ఇచ్చాడు. మళ్ళీ వచ్చి తాడెక్కి కన్నంలోంచి బైటికి వెళ్ళిపోయి తాడు పైకి లాగేసాడు. యశ్వంత్ పొట్లం విప్పి చూసాడు. అందులో నాలుగు చపాతీలున్నాయి.

ఒక నిముషంలో ఎంతో సమయం వుంది. కానీ భూకంపం పూర్తిగా నిముషంకూడా లేదు. కొన్ని సెకన్లు మాత్రమే ఈ భూకంపం మనుషుల్ని చంపిందా? భూమి కంపించినంత మాత్రాన మనుషులు చచ్చిపోతారా? భూకంపానికి ఇళ్ళు కదిలి బరువుగా కట్టినగోడలు, స్లాబులు, మీదపడి చచ్చిపోతున్నారు. అలా ఎందుకు జరిగింది. ఏమిటి లోపం భూకంపంరాగానే, మట్టి హల్వాలా అయిపోయింది. అందులోకి ఏదేనా కూరుకుపోతుంది. అలాంటప్పుడు ఇల్లు ఇంతబరువుతో కట్టిన ఇల్లు ఎవరు కట్టారో వాళ్ళనెత్తిమీదే కూలిపోతుంది!

కూలిపోయి చనిపోయినవాళ్ళ గురించి పర్వాలేదు. ఇల్లూ కూలింది. మనిషీ పోయాడు. ఇల్లుకూలి మనిషి బతికితే నే సమస్య! ఇల్లు కట్టింది ఇస్తారా? మొట్టమొదట నువ్వెవరు? అన్న ప్రశ్న నీ కిల్లు వుండేదని నమ్మకం ఏమిటి? నీ ఇడెంటటీ కార్డేదీ? ఇవన్నీ జేబులో పెట్టుకు భూకంపం వస్తుందని ఎదురుచూస్తాం అనుకుంటారేమో?

కానీ మనం అలాచూడం ఏదో మనపనిలో మనం వుంటాం పొద్దున్నే పిల్లల్ని స్కూలికి తయారుచేస్తూనో, ఆఫీసుకి తయారవుతూనో, షాపులో కలెక్టఅయి తెచ్చినథబ్బుబేంకుకి కట్టేప్రయత్నంలోనో, కిచెన్ లో కాఫీపెడుతూనో, ..టిఫిను చేస్తూనో అప్పుడు కదిలింది భూమి, మామూలుగాకాదు రిక్టర్ స్కేలుమీద 6.4 కొలత కొలిచింది. అంటే చాలా, సివియర్ అన్నమాట, ఎంత ప్రమాదం? అని ఎవరేనా అడగచ్చు, చెప్పడం కష్టం కూలిన ఇళ్ళు ఎన్నుంటాయో కూలుతూ కూలుతూ ఆగినవికూడా అన్నే వుంటాయి. పగుళ్ళేసినవి అంతకంటే ఎక్కువే వుంటాయి. కూలిన ఇళ్ళ కింద మనుషులకోసం వెదకి, కూలిపోయిన ఇటుకులు, కాంక్రీటు అక్కడనించి తప్పించాలి. సగం కూలిన ఇళ్ళని కూలగొట్టాలి. సగం కూలిన ఇళ్ళల్లో వున్నవాళ్ళు బతికున్నారా, లేదా, బతికుంటే వాళ్ళు ఇళ్ళు కూలగొట్టడానికి వొప్పుకుంటారా, వాళ్ళొప్పుకుంటే ఎంతిస్తారు, గవర్నమెంటు కూలగొట్టేస్తే వాళ్ళకెంత మిగుల్తుంది. అందులో మనకేం ముట్టచెప్తారు. అని అన్నింటికన్నా ముఖ్యమైన డైలమా, సగం వొరిగిన ఇళ్ళు కొంచెం వొరిగిన ఇళ్ళు వున్నాయి. కానీ రూపురేఖల్లో తేడాలేదు. చిన్న, బీట, కూడా లేదు. అలాంటి ఇళ్ళని ఏం చెయ్యాలి. పూర్తిగా కూలదోయాలా, కూలదోయక అవే వాడితే అవి కూలిపోయే అవకాశం ఎంతేనా వుంది. లేక కూలకనూ పోవచ్చు. పదిళ్ళువున్నాయనుకొందాం... కూలకపోతే, రెండుకోట్లు కూల్చేస్తే రెండుకోట్లు, కూల్చడానికి కొన్నిలక్షలు మళ్ళీ మంచిగా కట్టుకోడానికి మరి రెండుకోట్లు అంతా సందేహమే డైలమాలే ఏం చెయ్యాలి? ఏం చేస్తే మంచిది?

పూచర్లో ఏం జరుగుతుంది. మూడో నాలుగు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. కొందరు వొకవేపు మొగ్గుచూపితే మరికొందరు ఇంకో వేపు మొగ్గుచూపుతారు. ప్రభుత్వ సహాయం ఎంతుంటుంది. అప్పుగా వుంటుందా, అమాంబాపతుగా ఇస్తారా, ఎన్నో ప్రశ్నలు ఏఇల్లూ ఇన్సూరెన్స్ చెయ్యకపోడం వో తప్పు, అనుకోవచ్చు. కానీ ఇన్సూరెన్స్ వాళ్ళు చాలా తెలివైనవాళ్ళు, ఇలాంటి ఎర్త్ క్వేక్ (భూకంపం) వచ్చే స్థలాలు గుర్తించి ఇన్సూరెన్స్ ప్రీమియం పదిరెట్ల దగ్గర్నించి యాభైరెట్లు వరకూ పెంచుతారు. దాంతో ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టడమంటే మరో ఇల్లు కట్టుకోవడమే. మామూలుచోట ఇంటికి ఇన్సూరెన్స్ ప్రీమియం 400రూ వుంటే, ఇలాంటి భూకంపం వచ్చే అవకాశం వున్న చోట్ల ఇంటికి ఇన్సూరెన్స్ ప్రీమియం 40000/–దాకా వుంటుంది. అదెలా గంటే ఇండియా ఇన్సూరెన్స్ రిస్క్ మేప్ ని తయారుచేసారు. అందులో అండమాన్స్ అరుణాచల్ ప్రదేశ్ అస్సాం కచ్ (గుజరాత్) చంబాకులు, కాంగ్రా మరికొన్ని (హిమాచల్ ప్రదేశ్) బారమల్లా శ్రీనగర్ మధుబని, బీహార్ లో రత్నగిరి సతారా (మహరాష్ట్ర) ఇవన్నింటికి వొకవెయ్యి రూపాయల కవరేజికి ఒకరూపాయప్రీమియం వసూలు చేస్తారు.

అలాగే ఢిల్లీ చండీగడ్ బీహార్ లో కొన్ని ప్రదేశాలకి ఉత్తరప్రదేశ్ లో కొన్ని ప్రదేశాలకి పంజాబులోనూ, బెంగాల్ లోకొన్ని ప్రదేశాలకి యాభైపైసలు వసూలుచేస్తారు. మిగతా ప్రదేశాలు చాలా తక్కువ రిస్కు వుంటుంది. ముప్పైపైసలు ఆంధ్రాలో అయితే ఇరవైపైసలు వసూలు చేస్తారు. అయితే ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రభుత్వం చేతుల్లోనే వుండడం వల్ల వాళ్ళు ప్రచారం చెయ్యరు. ప్రజలు పెద్ద అవసరం లేదు. అనుకుంటారు. ఆ విధంగా ఏదేనా భూకంపం వచ్చి నప్పుడు ప్రభుత్వం ఖర్చుపెట్టి అవసరం తీరుస్తున్నా అనుకుంటుంది. ప్రజలు అవసరం తీర్చలేదను కుంటారు. అది వేరే విషయం.

---------------------

ఎండ వీధి నిర్మానుష్యంగా వుంది. వీధికి ఇరుపక్కలా ఇళ్ళేవున్నాయి. కానీ నేలమట్టం అయిపోయాయి. వీధి అన్నది సజావుగాలేదు. ఇటుకలు, రాళ్ళు, వొరిగిన కాంక్రీటు స్థంబాల్నుండి పొడుచుకొచ్చిన వూసలతో చాలా భీబత్సంగావుంది. ఇళ్ళల్లో ఎవరూ బతికి లేరా, వుంటే ఏమయ్యారు. ఇటికల్ని

దాటుకుంటూ నడుస్తున్నారు. దంతి విధాత ఎక్కడ చూసినా దుమ్ము ధూళి కాలువలోని మురుగు బైటికి వచ్చేసింది. కంపు కొడ్తోంది. వీధిలో ఎవరు ఎందుకులేరు? ఎవరూ బతకలేదా?

పొద్దున్న ఎనిమిది గంటలకి వచ్చింది భూకంపం. మానవప్రపంచం మత్తునుండి బైటపడలేదా, జాన్యువరినెల మంచిచలి, అన్నింటికీమించి ఆరోజు జనవరి ఇరవైఆరు శలవురోజు ... ఇంట్లో చిన్నపిల్లలుంటే తప్ప వీళ్ళులేవరు. బద్ధకం, మత్తు, ఏం జరిగిందో తెలుసుకునే సరికి నెత్తిమీద కప్పు కూలి పోయుంటుంది. బలంగా వుండాలని కట్టిన మందపాటి గోడ మీదపడుంటుంది. అదెందుకు పడింది?........

భూమిలో ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో అయిదారడుగులు అటుఇటు జరిగితే ఇంత నాశనమా,
ఆలోచిస్తుంటే దంతికి ఆశ్చర్యం వేసింది.

'ఈ, రిక్టర్ స్కేలు, అంటే ఏమిటి?....,'

దీన్ని రిక్టర్ మాగ్నిట్యూడ్ అంటారు. రిక్టర్ మాగ్నిట్యూడ్ భూమికింద జరిగే కదలికని తెలుపుతుంది. అయిదువరకు ఇది భూమిమీదపాకుతున్న పాములా వుంటుంది. అంటే మనకి తెలుస్తూ వుంటుంది. బుస వినబడి ప్రమాద సూచిక నిస్తుంది. ఆరుసంఖ్య దగ్గరకొచ్చేసరికి లేదా ఆరుసంఖ్య దాటేసరికి పడగఎత్తి కాటేసే నాగులా తల ఎత్తుతుంది.

అదీ ఎంత ఎత్తైనా ఎదగ గలదు. అంటే కచ్చితంగా ప్రమాదమే. అందుకే ఆరుసంఖ్య దాటగానే ప్రాపర్టీలాస్, హ్యూమన్ లాస్, అన్నీ వుంటాయి. ఈ పడగ ఎత్తడం అన్నది, కొన్ని సెకెండ్స్ మాత్రమే వుంటుంది. అది చాలు మానవ జీవితాన్ని, అతలాకుతలం చెయ్యడానికి, అయితే ఇంతకన్న మంచి స్కేల్స్ వున్నాయి. మూమెంట్ మాగ్నిట్యూడ్ అది ఎంతశక్తి వెలువడుతుందో చెప్తుంది.

రిక్టర్ స్కేలు కన్నా మంచిది కూడా కానీ మీడియా ఏది ప్రచారం చేస్తే అదీ వెలుగులోకి వస్తుంది. మీడియాకి ఇది చాలా తేలిక అందుకే ఇది ప్రచారంలోకి వచ్చింది.

అయితే ఎంత మాగ్నిట్యూడ్ తో భూకంపం వచ్చినా, భూమిమీద వుండే పరిస్థితులపై ఆధారపడివుంటుంది. భూమిమీద నల్లరేగడిమట్టివుంటే, క్రింద భూమి కదిలి నప్పుడు భూమి అడుగున వుండే నీరు పైకి వచ్చి మట్టిస్పాంజ్ లా తయారవుతుంది. ఆ మట్టిలో కట్టిన అన్ని భవనాలు కూలిపోతాయి.

కొన్ని భవనాలు కూలిపోయి వొరిగిపోతాయి. అవి ఎందుకూ పనికిరావు. వాటిని కూలదోయాలి. కట్టడానికి ఎంత ఖర్చవుతోందో కూలదోయడానికి అంతే ఖర్చవుతుంది. గవర్నమెంటు కొన్ని విషయాల్లో స్వచ్ఛంధంగా సహాయం చెయ్యాలి. తప్పదు. కానీ భూకంపం వచ్చిందగ్గర్నించి, దాన్ని గుర్తించి, బాధితులకి, సహాయం.... శిధిలాలకింద ఇరుక్కున్న వాళ్ళని గుర్తించి సహాయ మందించడం, చచ్చిన శవాలని పైకి తీసి కాల్చడం, ఏదేనా, ఎపిడమిక్, వుదృతంగా ప్రబలకుండా చూడడం వైద్యసహకారం, నీరు, ఆహార సరఫరా అనే అనేక విషయాల్లో సంయమనం కుదరక... నిజాయితీ కొరవడి వో పెద్ద అస్తవ్యస్తమైన వ్యవస్థ ఏర్పడుతుంది....,,

"అది మనకి లాభిస్తుంది'' అంది దంతి నవ్వుతూ.

''కొంత వరకూ నిజం'' అన్నాడు విధాత.

"దాంతో సగం పడ్డఇళ్ళు, వొరిగి పడీపడని ఇళ్ళని ఎవరూ పట్టించుకోరు. ఆ ఇంటివాళ్ళకి అదో పెద్దగండమై కూర్చుంటుంది.'' అని చెప్తున్న విధాత దంతికి మూలుగు వినిపించింది. విధాత వొక్క పరుగున ముందుకి వెళ్ళాడు.

మూలుగు వినిపించిన వేపు చూసాడు. అక్కడ ఎవడో కూర్చుని వున్నాడు. వాడి వంటినిండా ధూళి కాలు పచ్చడైపోయింది. రక్తం ధూళిలో కలిసి కాలంతా అంటుకుంది. వాడి షర్టు ఫేంటు చిరిగి వున్నాయి. విధాత వెళ్ళేసర్కి వాడు నిద్రలో వున్నాడు మూలుగుతున్నాడు, చాలా గట్టిగా... నీరసం వల్ల వచ్చిన మూలుగు.

విధాత వాడ్ని చూస్తుండగా దంతి వచ్చింది. అక్కడ పడున్న వాడ్ని చూసింది. బేగ్ లోంచి వాటర్ బాటిల్ తీసింది. విధాత అడ్డుకున్నాడు.

''మనం తెచ్చుకున్నవే తక్కువ, అవి వాడికి దొబ్బడతావేమిటి?'' అన్నాడు చిరాగ్గా.

''మరి నువ్వు రొట్టెలు, నీళ్ళు ఇంతకు ముందువాడికి దొబ్బెట్టలేదా'' అంది విసుగ్గా

''వాడు వాటికి మూడున్నరలక్షలు ఖరీదుచ్చుకున్నాడు'' అన్నాడు.

దంతికి ఏం మాట్లాడాలో తెలీలేదు. మౌనంగా వుండిపోయింది.

లమ్డీకొడుకు ఎంత ఖరీదు కట్టేడు బాటిల్ వాటర్ కి_ _ _.., అనుకుంది. వీళ్ళ అలికిడికి మూలుగుతున్న వాడు కళ్ళు తెరిచి చూసాడు. వాడి కళ్ళల్లో విచిత్రమైన వెలుగు వెలిగి మాయమైంది. దంతి ఆ వెలుగు పసికట్టింది. చేతిలో వున్న బాటిలు వాడికిచ్చేసింది.

“బుద్ధి తక్కువ ముండ,'' అనుకున్నాడు విధాత. ఎందుకంటే దంతిని అడ్డుకుంటే గోళ్ళతో రక్కేస్తుంది. అలా ఇష్టం లేనప్పుడు చెయ్యేసి చాలాసార్లు రక్కించుకున్నాడు కూడా.

వాడు మంచినీళ్ళు తాగాడు. ఇంతకుముందు శిధిలాలమధ్య మమ్మీ రూపంలో వున్నవాడు, ఇప్పుడు శవం రూపంలోకి వచ్చాడు.

విధాతని చూసాడు. విధాత వాడ్నే గమనిస్తున్నాడు.

వాడు ''చంపెయ్,'' అన్నాడు

విధాత షాక్ తిన్నాడు.

''చంపెయ్ (మారో)'' అన్నాడు వాడు మళ్ళీ .

విధాతకానీ, దంతికానీ, మాట్లాడలేదు. నాకు స్థలం కావాలి, అన్నాడు వాడు మళ్ళీ,..,,ఎహో పొండిక్కడ్నించి, అని విసుక్కున్నాడు.

నిముషానికోలాగ మాట్లాడుతున్నాడు. మాటకీమాటకీ మనిషిగా పుంజు కుంటున్నాడు.

విధాతకి అతని మీద ఇంట్రష్టుపోయింది. దంతి అతన్నే చూస్తోంది ఎందుకు ఎందుకో తెలీదు. అతనాకర్షించాడు.... వాడి బాధ... వాడి మాటల్లో జాలి కనిపించడం లేదు. వాడెందుకు అలా ప్రవర్తిస్తున్నాడో కూడా తెలీదు. వాడికి కావలసిన వాళ్ళు చనిపోయి వుండచ్చు. లేదా వాడి నెత్తిమీద ఏదేనాపడి మతి చలించి వుండచ్చు. మన స్థిమితం కోల్పోయివుండచ్చు. జరిగిన వినాశానికి, సహాయంలేక లేదా జరుగుతున్న జాప్యానికి తట్టుకోలేక పోయివుండచ్చు. కాని బతికున్నాడు..... ఇలాంటి సంఘటనల్లో బతికున్నవాడిదే అసలుబాధ అదే అతను పడుతున్నాడు.

అతడు అలా మాట్లాడి మాట్లాడి కాసేపు సెదదీరాడు. బాటిల్ లో నీళ్ళు తాగాడు. ఈ సారి అరవలేదు, చలో, అంటూ లేచాడు కానీ నిలబడలేక దబ్బున పడ్డాడు. పాదాన్ని పట్టుకు గిలగిలల్లాడాడు. తెలిసిన దేవుడ్నల్లా తిట్టాడు. మళ్ళీ కాలు విదిలించి లేవడానికి ప్రయత్నించాడు. పూర్తిగా లేవలేక పోయాడు కాని పర్వాలేదు.

కుంటుతున్నాడు.... కాలు ఈడుస్తున్నా, ఒొక కాలిమీద గెంతుతున్నాడు. శిధిలాల్లోకి వెళుతున్నాడు. అదో అయిదంతస్తుల ఎపార్టుమెంటు పూర్తిగా కూలి పోయింది. అంతటా శిధిలాలే. ఇటికముక్కలు, అడ్డదిడ్డంగా పడ్డదూలాలు, స్లాబులు అదో పెద్దగుట్ట అలా పడ్డగుట్ట దగ్గర పడుకుని లోపలికి దొర్లాడు. శిధిలాల్లోకి మాయమయ్యాడు.

దంతి ఒొంగొొని చూసింది. ఏం కనబడ్లా అంతా చీకటి, విధాత వంగిచూసాడు. కుంటుతున్న వాడూ కనబడలేదు. విధాత పడుకుని దూలం దగ్గరగా లోపలికి దొర్లాడు. దూలానికి నేలకి చిన్న సందు మాత్రం వుంది. ఆ శిధిలాల్లో కనీకనిపించక మసగ్గా వుంది. సన్నటి వెలుతురు పడుతోంది. దంతి, విధాత లోపలికి రాగానే బేటరీ లైటు వెలిగించారు. అది ఆ అపార్టుమెంటుకి మధ్యభాగం, అక్కడవున్న రెండుమెట్లు ఒొరిగిపోయి క్రష్ అయిపోయాయి. కిందని కాంక్రీటు దూలాలు, స్థంభాలు గుట్టగాపోసినట్టున్నాయి చాలా ఇళ్ళకి సింహద్వారం క్రష్ అయిపోయింది. గోడలు పగిలి కూలిపోవడం వల్ల కిటికీలు కిటికీల్లాగేనేలమీద పడివున్నాయి. ముందుగా వెళ్ళుతున్న అతను సగం పడిపోయిన గోడపక్కనుంచి వెళ్ళాడు. ముందుగా వెళ్ళుతున్న అతను ముక్కుతూ, మూలుగుతూ, దేకురుతూ, కుంటుతూ వెళుతున్నాడు. అతనికి అంతా తెలిసినట్టుంది. అయినా మెల్లగానే ముందుకి సాగుతున్నాడు. అందుకే దంతి విధాత చిన్న వెలుగులో అన్నీ పరిశీలిస్తూ నడుస్తున్నారు.

అతను దూరిన కూలిన గోడపక్కగా విధాత వెళ్ళాడు. అదో గది అందులో అడ్డంగా దూలం సగం పడిపోయింది. స్లాబు పూర్తిగా ధ్వంసం అయిపోయింది. దాని వూసలన్నీ బైటపడిజాలుగావున్నాయి. దానిమీద ఇంకోస్లాబు పడి లోపల చీకటిగావుంది. కానీ నేలమీద ఎవరో ఒకామె వయస్సు 35 ఏళ్ళు వుండచ్చు, ఆమె నడుంపై దూలం పడి పొత్తికడుపు కింద భాగం క్రష్ అయిపోయింది. చచ్చిపోయింది. మొహం అంతా ధూళితోవున్నా పెదాలకి వేసిన

లిప్టిక్ చెవులకి మెళ్ళోచేసుకున్న అలంకరణ స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతోంది. దంతి కుంటుతున్న వాడితో ముందుకి వెళ్ళిపోయింది. కానీ విధాత వెనగ్గా ఏంచేస్తున్నాడా?.... అని చూసింది.

విధాత వొంగి, ఆవిడ మెళ్ళోగొలుసు, నక్లెస్ చెవులకున్న డ్రాప్ తీసేసాడు. చేతులకున్న బేంగిల్స్ కూడా తీసి వీపుకున్నబేగ్ లో వేసాడు.

అప్పుడు తట్టింది. దంతికి తాము అందుకోసమే కదా వచ్చాం అని. ఎదురుగా చూసేసరికి కుంటుతున్న వాడు కనబడ్లా వాడిమూలుగు వినిపించలా వీడేమయాడు. ఎలా మాయమయ్యాడు. దంతి, విధాతని చూసింది. ఇద్దరూ లైటేసి చూస్తున్నారు. ఎక్కడా, సందుకాని చోటుకానీ లేదు. వీడెక్కడికి మాయమైపోయాడు. జాగ్రత్తగా గమనిస్తున్న విధాతకి వొకచోట సున్నం చిన్నగా రాలుతూ కనబడింది. అక్కడికెళ్ళాడు. దూలానికి మధ్య చిన్నసందుంది. ఆ సందుపైన వి ఆకారంలో విరిగిపడిన స్లాబుంది. ఆ సందులోంచి దూరి ఆస్లాబుమీదకి వెళ్ళాడు కుంటివాడు. విధాత కూడా అలాగే దూరి పైకి వెళ్ళాడు అక్కడ నాలుగుగోడలు వి ఆకారంలో విరిగిన స్లాబుమీద పడి పోయాయి.

స్లాబుకి మధ్యగా మంచం ఉంది. అది కూడా విరిగి వంగి పోయింది. దానిమాద కురిసిన ఇటుకల వానకి, గోడ పెచ్చాలతో కూరుకు పోయిన శవం వుంది. ఒక చెయ్యి మాత్రం బైటకి వుంది. తల బైటకే వుంది. తల అంటే జుత్తు మాత్రం కనిపిస్తోంది. చెయ్యి తెల్లగావుంది. విధాత జత్తు మీద పడ్డ ఇటుకలు పక్కకి తోసి మెడ తడిమాడు. ఎక్కడా గొలుసులు, నగ కనిపించలేదు.

అక్కడ నుండి కుంటివాడితో కాంక్రీటు స్దంబాలని తప్పించుకుంటూ ముందుకి వెళ్ళాడు. అక్కడ కుంటాడు కష్టపడి సగం పడ్డ స్లాబు మీదకి ఎగబాకాడు. అక్కడ కాస్త వెలుగ్గా వుంది. గాలి కూడా వేస్తోంది. అక్కడ పైస్లాబు దూలాలు పడ్డా, స్ధంభాలు మాత్రం పక్కలకి వొరిగాయి. అదే స్లాబు మీద కుంటాడు.. వో ఇటుకల గుట్ట దగ్గర కూర్చున్నాడు. ఏడుస్తున్నాడు.

మళ్ళీమళ్ళీ ఏడుస్తూ దంతికి ఆ గుట్టని చూపిస్తున్నాడు. ఆ గుట్టలో మూడుశవాలున్నాయి. కనీకనిపించనట్టున్నాయి. వాటిని ఎవరూ తీద్దామనుకోరు. అవి ముగ్గురుపిల్లలవి. ముగ్గురికి మూడునాలుగేళ్ళు తేడా వుండచ్చు. పదిహేను నుండి పదిఏళ్ళ వరకూ వుండచ్చు. అతను వాళ్ళని చూపించి 'నా పిల్లలు నా పిల్లలు' అని గట్టిగా అరిచేడు. వాళ్ళని పాతిపెట్టాడట. పైకి తియ్యమంటున్నాడు.

కుంటివాడ్నే చూస్తున్నాడు విధాత. వీడిందుకా తమని పైకి తీసుకొచ్చాడు. వాళ్ళని పాతిపెడ్తేనేం, పాతిపెట్టకపోతేనేం, వాళ్ళెలాగూ పాతిపెట్టబడే వున్నారు. కుంటివాడి ఆతృత చూసి ఎవరేనా బతికున్నారేమో అనుకున్నాడు. కానీ ఇంత కష్టపడి పైకి వచ్చింది ఇందుకా! విధాతకి చికాకేసింది. ఈ చావులు చూసి హృదయం కదలలేదు. ఎవ్వరూ ఏమీ చెయ్యలేనిది.

వాళ్ళని పాతిపెట్టాలంటాడు కుంటాడు. ఏడుస్తున్నాడు. కుంటాడ్ని ఏం అనాలోతెలీక బైటికి పోయేదారికోసం వెతుకుతున్నాడు విధాత.

........................

జనవరి 26 రిపబ్లిక్ డే రోజు...... దేశానికి హాలిడే... అందరికి కాదు.

పిల్లలు తయారై స్కూలుకి వెళ్ళాలి.

కొంతమంది పెద్దలు ఆఫీసుకెళ్ళి జెండా ఎగరెయ్యాలి. అందులో సెక్రటియేట్ కెళ్ళి జెండా ఎగరెయ్యాలని చీఫ్ సెక్రటరీ తాపత్రయంకానీ సమయానికి ఏదీ అవడంలేదు. లేవడం అరగంట లేటు. స్నానం దగ్గర....... లేటుకి పదినిముషాలు చేరింది. డైనింగ్ టేబులు దగ్గర, బ్రేక్ ఫాస్ట్ ఫాస్ట్ గా తయారవలేదు. అతను కార్న్ ప్లేక్స్ ఇచ్చేయ్ అంటున్నాడు. అప్పుడు గిన్నెలు కదిలాయి, టేబులు వూగింది. ఒక పది సెకెండ్స్ భయం వేసింది. టేబులు దగ్గర్నించి పారిపోదామనిపించింది. తర్వాత అంతా సర్దుకుంది. కార్న్ ప్లేక్స్ వచ్చాయి.

''భూకంపంలా వుంది,''. అంది భార్య.

''రాజధాని కదా పొలిటికల్ గా కూడా భూకంపాలొస్తాయి.'' అన్నాడు. చీఫ్ సెక్రటరీ నవ్వుతూ...బ్రేక్ ఫాస్ట్ ముగించి, గబగబా కారుని చేరుకునేసరికి కారు డ్రైవరు ''భూకంపం వచ్చింది సార్ '',అన్నాడు.

''వూహూ,'' అని బుర్రతాటించి కారులోకెక్కాడు.

సెక్రట్రయేట్ కెళ్ళేసరికి, కొంచెం హడావిడిగా వుంది. ''కంట్రోలు రూముకి పదండి.'' అన్నారు కొందరు... కంట్రోల్ రూముకెళ్ళేసరికి అక్కడ ఫోనుల్తో కుస్తీ పడ్తున్నారు కొందరు.

ఎవరికి ఫోను చేసినా ఎంగేజ్ శబ్ధం వస్తోంది. ఎవ్వరూ ఫోన్లు ఎత్తడం లేదు. ఎక్కడెక్కడికో ఫోన్లు వెళ్తున్నాయి. దేనికీ సమాధానం లేదు. ఆశ ఫోన్లు బాగుపడతాయని. చిన్న ఎర్త్ క్వేక్ వచ్చింది. కదా క్షేమసమాచారాలతో ఫోన్లన్నీ బిజీ అయివుండచ్చు.

ఇవాళ శలవుకదా ఆ రకంగానూ లైన్లు కాళీలేకపోవచ్చు. ఎవ్వరికీ సమాచారం తెలీడం లేదు. కాలం గడిచిపోతోంది. రాజధానిలో కూడా ఫోన్లు పనిచెయ్యడంలేదు. ఏమైవుంటుంది? ఎందుకు పనిచెయ్యడం లేదు? సమయం గడుస్తున్నకొద్దీ టెన్షన్ పెరిగిపోతోంది. అప్పుడే ఎవరో న్యూసు పట్టుకొచ్చారు. రాజధానిలో అయిదంతస్థుల భవనం కూలిపోయిందని, చాలామంది చనిపోయారని, నిజమా, అబద్ధమా ,అన్నది ఎలా తెలుస్తుంది. భవనం భూకంపం వల్లే కూలిపోయిందా మరే కారణాలు వున్నాయా!? ఏదో ఆషామాషీగా మొదలైన భూకంపం వ్యవహారం సీరియస్ గా ఆలోచింపచేస్తోంది. ప్రమాదం అన్నది చాలా మంది మనస్సుల్లో ఇంకింది.

మెట్రియాలజీ ఆఫీసుకి ఫోను చేసారు. సమాధానం లేదు. ఎవరో వొకరు ఫోను ఎత్తుతారు. ఏదో విషయం చెప్తారు. ఆతృత... కాలం గడుస్తున్నకొద్దీ అందరికీ అర్థం అయింది. పోన్లింక పనిచెయ్యవని. అయితే ఏం చెయ్యాలి? విషయం ఎలా తెల్సుకోవాలి?

భూకంపం ఎక్కడ ఎక్కువ వచ్చింది. ఎపిసెంటర్ ఎక్కడ? ఎవర్నడగాలి? ఎవర్నడిగితే విషయం తెలుస్తుంది? ఈ లైన్లు టెలిఫోన్లు ఏవీ పనికిరావడం లేదు. న్యూస్ వచ్చేసింది. భూకంపం అని... కానీ ఎంత ఎక్కడ ఎక్కువగా వచ్చింది. ఎంత ఎక్కువగా వచ్చింది. ఎవరికి చెప్పాలి. ఏమిటి చెప్పాలి కంట్రోలు రూములో గంటలు గడుస్తున్నాయి.... మొహాలు ఏర్రబడుతున్నాయి. విషయం మాత్రం నిర్ధారణ కావడంలేదు.

ఈ ఆతృతలో అయిదుగంటలు గడిచిందని కూడా ఎవరూ గుర్తించలేదు. అప్పుడే ఎవరికో తట్టింది. 'పదండి మెట్రియాలజీ ఆఫీసుకి' అన్నారు. అంతే ఇద్దరు పరిగెట్టారు. కారు తీసారు. కారు మెట్రియాలజీ ఆఫీసుకి వెళ్ళింది. అంతే కాని మెట్రియాలజీ డిపార్టుమెంట్ నుండి సెక్రట్రయేట్ కి ఎవరూ ఎందుకు రాలేదు. భూమి కంపించిందని తెలియగానే మెట్రియాలజీ ఆఫీసుకెళ్ళి విషయం గ్రహించి. చీఫ్ సెక్రటరీకి ఫోను చెయ్యచ్చు, ఫోను పనిచెయ్యకపోతే, వచ్చి సమాచారం చేరవెయ్యచ్చు ఎందుకు చెయ్యలేదు. ఆ డిపార్టుమెంటు పని చెయ్యదా? అక్కడ బాధ్యతాయుతంగా పనిచేసే మనుషులు లేరా? ఎన్ని అభివృద్ధులు చెందినా, ఎంత టెక్నాలిజీ మనచేతుల్లో వున్నా అంతా శూన్యం ఫలితం జీరో ఇప్పుడు జరిగింది. అదే వెళ్ళిన వాళ్ళేమయారు, వాళ్ళకి విషయం తెలిసిందా, సమయం గడుస్తోంది. వదంతులు వినిపిస్తున్నాయి. ఏదీ నిర్ధారణ కావడంలేదు.

అప్పుడొచ్చింది సమాచారం స్వంతంగా ఏర్పరుచుకున్న మెట్రియాలజీ డిపార్టుమెంటు నుండి కాదు.... దేశరాజధాని నుండి ఏ ప్రాంతంలో ... భూకంపంవచ్చిందో ఎంత వచ్చిందో... అర్థమైన భాషలో రిక్టరుస్కేలు మీద 6.9 వుంది. అంటే ఎపి సెంటర్ దగ్గర భూమి 6 అడుగుల వరకూ జరిగింది.

ఎపిసెంటర్ దగ్గర చుట్టుప్రక్కల దాని పవర్ వున్నంత మేరా మానవ నాశనం జరిగింది. నాశనం జరిగిన ఆరుగంటలకి నాశనం జరిగిందని తెలిసింది. ఎంత నశించింది. ఏమేనా మిగిలివుందా మనం ఏం చెయ్యాలి. నాశనం జరిగిందంటున్న ప్రదేశానికి, ఎంత కాంటాక్టు

చేసినా ఎవరూ పలకడంలేదు. ఎలా? పలుకుతారు. టెలికమ్యూనికేషన్స్ దెబ్బతిన్నాయి. సెట్ లైట్ ఫోన్స్ పన్చెయ్యవు. అసలవి అంటూ వున్నా పట్టించుకోరు.

విషయం తెలిసింది. భూకంపం వచ్చిన ప్రదేశం తెలుసు, ఏం చెయ్యాలి? ఎవరు చెయ్యాలి? అన్ని పవర్సూ ఛీఫ్ మినిష్టర్ చేతుల్లో వున్నాయి.

చీఫ్ సెక్రటరీ వున్నాడు. కానీ ఈ విషయం ఛీఫ్ మినిష్టర్ కి చెప్పాలి. ఛీఫ్ మినిష్టర్ కి విధ్వంసం జరిగిందని మనసులోకి ఇంకాలి, లైటుగా తీసుకోకూడదు. అలా జరగాలంటే ఎక్కడ ఎంత ధ్వంసం జరిగిందో స్పష్టంగా తెలియాలి. ఎలా తెలుస్తుంది?

ఇలా విధ్వంసం జరిగింది. అంటే... అలా జరిగిందా తర్వాతేం చెయ్యాలి అని తిరిగి మనల్నే అడుగుతాడు. అసలు తన బాధ్యత అంతా చీఫ్ సెక్రటరీకి ఏం చెయ్యాలో చెప్పడంలో సరిపోతుందని అనుకుంటాడు. అలాగని చీఫ్ సెక్రటరీ ఏదేనా స్వంతంగా నిర్ణయం తీసుకుంటే, నాతో వొకమాట మాత్రమేనా చెప్పచ్చుగా అంటాడు. వాళ్ళా మాట చెప్తే సరిపోదు. చెప్పి కన్విన్స్ చెయ్యాలి. అంత టఫ్ (గట్టివాడు) చీఫ్ మినిష్టర్ అనిపించుకుంటాడు. ఈ భూకంపానికి జరిగిన నష్టం తెలిసి కన్విన్స్ అయిన చీఫ్ మినిష్టర్ తర్వాత భూకంపానికి వుండడు. వాడ్ని మళ్ళా కన్విన్స్ చెయ్యాలి. పోనీ ఎవరేనా స్వంతంగా పనిచేస్తే ... తన అధారిటీని ఖాతరు చెయ్యలేదనుకుంటాడు. ప్రజాసేవకుడల్లా ప్రజాపాలకుడు లేదా ప్రజాపాతకుడు  అయిపోతాడు. ఏం చెయ్యాలి ఏ విషయం చీఫ్ మినిష్టరుకి చెప్పి ఏసలహా ఇవ్వాలి అని డైలమాలో వుంటే...!!?

................

రిక్టర్ స్కేలు మీద భూకంపం 6.9గా కొలిచిన ప్రదేశంలో పెద్దవిధ్వంసం జరిగింది. ఇళ్ళు కూలిపోయాయి. ...తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా నిట్టనిలువునా నీడనివ్వవలసిన ఇళ్ళు కూలిపోయాయి. ప్రజలు నిర్ఘాంతపోయారు. కట్టుకున్న ఇంటికప్పులకింద, గోడల మధ్యపడి, చనిపోయారు. నలిగిపోయారు.

కొంచెంగా బతికున్నవాళ్ళు మాత్రం ఎవరేనా వస్తారా సాయం చేస్తారా, బతుకుమీద ఆశతో ఎదురుచూస్తున్నారు. నాలుకలు ఎండిపోతున్నాయి. కాళ్ళల్లో చేతుల్లో రక్తం గడ్డకట్టుకుపోతోంది... తనమీద పడ్డది స్లాబు తనింకా ఎలాబతికున్నాను. అని ఆశ్చర్యపోతున్న చచ్చిబతికిన మనుషుల్ని రక్షించేవాడు లేడు.

ముందు చావగా బతికిన వాళ్ళు, శిధిలాలకింద ఇరుక్కుపోయిన వాళ్ళు, వాళ్ళ సమాచారం రక్షించేవాడికి తెలియాలి. ఎలా తెలుస్తుంది. వీడు చెప్పలేడు. ఎన్ని స్లాబులకింద వున్నాడో, ఎంత పెద్దగుట్ట కింద ఇరుక్కున్నాడో, అరవాలా అరిస్తే ఎవరేనా వస్తారా, అరిస్తే వినిపిస్తుందా, రాజధానిలోనే ఇలావుంటే మిగతా చోట్ల ఎలావుందో, ఇంతకీ గవర్నమెంటు మేల్కొందోలేదో ఎవరు ఎవరికి చెప్తారు. ఎవరు వస్తారు. తనని రక్షించడానికి, గది మధ్యన నిలబడి వుంటే ఫేను రాడ్ గుచ్చుకు ప్రాణం పోయేది. రూముకి అవతల మూలున్న గోడకూలి చచ్చిపోయాడే వాడు ఇవతల మూల వున్నాడు. ఇవతల మూల గోడబైటకి కూలితే అవతల మూల గోడలోపలికి కూలింది. దానిమీద స్లాబు అడ్డగా పడింది. అందులో సందు ఏర్పడింది. ఆ సందులో ఇరుక్కుపోయాడు. కదలడానికి లేదు. కాలు కదపడానికిలేదు. బుర్రతిప్పడానికి లేదు. ఎంతసేపిలా వుండాలి, ఇలాగే చచ్చిపోతానేమో సమయం తెలీదు తెలుస్తున్నట్టుగా వుంది. రాత్రి అయుండచ్చు. చీకటిగా వుంది. అన్ని తరుపులా మూసేసి చీకటి అయిపోయింది. చీకటికి తెల్లవారడం రాత్రవడం అన్నది వుండవు...

చీకటి చీకటే కానీ వేడి పెరిగితే పగలని. చల్లబడితే రాత్రని గుర్తిస్తున్నాడు. అయితే ఎన్ని సార్లు వేడెక్కింది. ఎన్నిసార్లు చల్లబడింది. అన్నది తెలియడంలేదు. అయితే వీడ్ని రక్షించే బాధ్యత వొక స్విస్ వాడిమీద వుంది.

అందుకే భారత ప్రభుత్వం భూకంపం వచ్చిన పద్నాలుగు గంటలకి స్విస్ ప్రభుత్వాన్ని సహాయం అర్ధించింది.

సహాయం అర్ధించిన గంటలో రెడ్ క్రాస్, స్విస్ డిజాస్టర్ రిలీఫ్ వర్కర్లని అప్రమత్తం చేసింది. స్పెషల్ విమానం అమర్చుకుంది. స్విస్ డిజాస్టర్ రిలీఫ్ టీములో డాక్టర్లు హెల్త్ వర్కర్లు, టెలికమ్ స్పెషలిష్టులు, పేరామెడికల్ వర్కర్లు, లాజిష్టిషియన్స్, తొమ్మిదిడాగ్స్ (స్నిప్పర్ డాగ్స్ ) సోనార్ వైబ్రేటర్స్ , క్రేవీస్ నుండి చూసే కెమెరాలు, హార్ట్ బీట్ పసికట్టే సెన్సర్స్, డ్రిల్లింగ్ మిషీన్స్, స్లింగ్స్, (ఇనపగొలుసులు తాళ్లు,) మొత్తం ఓ ఇరవైటన్నుల సామాన్లుతో కబురందిన అయిదుగంటల్లో జూరిచ్ ఎయిర్ పోర్టుకి చేరుకున్నారు. రెస్క్యూ చెయ్యడమే కాదు. కాపాడిన వాళ్ళకి సహాయం చెయ్యాలి... అన్న ధృడ సంకల్పంతో దుప్పట్లు, మందులతో సహా బయలుదేరారు.

సహాయం ఆర్ధించిన పదహారు గంటల్లో ఆరెంజ్ యూనిఫార్మ్ వేసుకున్న మనుషులు, స్నిప్పర్ డాగ్స్ కాంక్రీటు గుట్టఎక్కి సందుల్లో వెదుకుతూ కాంక్రీటు, ఇటుకల భారాన్ని తొలగిస్తూ ఎవరేనా బతికున్నారా, అని వెతుకుతున్నారు. వెతుకులాట ఎక్కువసేపు జరగలేదు. ఇద్దరు బ్రతికారు. శిధిలాల్లో ఇద్దర్ని రక్షించారు. మరో వూరికి వెళ్ళిపోయారు. అక్కడా అంతే .... మరో వూరు అక్కడా అంతే.. ఇలా పదిమందిని రక్షించి, టెలిఫోన్లు సరిచేయగలిగినవి సరిచేసి అయిదో రోజుకల్లా వాళ్ళ దేశం వెళ్ళిపోయారు.

ఇక్కడ చెప్పొచ్చేదేమిటంటే... వేగం.. మానసికంగా తయారుగా వుండడం.. నేనే చెయ్యాలా, ఇది నాపనా, ఎవరేనా వాళ్ళ పనిని నా మీద రుద్దుతున్నారా అన్న ఆలోచన్లు లేకపోవడం.

"భూకంపం" అని అరిచాడు రాజ్.. అరవడమే కాదు పైజామాతో బైటకి పరిగెట్టాడు. రోడ్డు చేరుకున్నాడు. అతని భార్యకానీ పిల్లలుకానీ అలా పరిగెట్టలేకపోయారు. చనిపోయేంత ప్రమాదం అని తెలుసుకోలేకపోయారు. చేస్తున్న పనిని ఆపలేకపోయారు. కూలిపోతున్న గోడల్ని ఆపలేకపోయారు. వాటికింద ఇరుక్కుపోయారు, నలిగిపోయారు. అలా పారిపోయింది. రాజ్ వొక్కడే కాదు.

చాలమంది పేర్లవసరం లేదు. కూలిపోతున్న వాటిని నిర్ఘాంతపోయి చూస్తూ... జరుగుతున్న విధ్వంసాన్ని ఆపలేక నిశ్చేష్టులైపోయారు. ఆ రోడ్డుమీద... ఆ కాలనీలో... ఆ వూర్లో... నిన్న నిటారుగా నిలబడి నీడనిచ్చిన ఇళ్ళు ఈరోజు ఇటుకల గుట్టగా మిగిలాయి. ఎందుకూ పనికిరాని (డెబ్రిస్) రద్దీగా ఎదురుగా నిలబడివున్నాయి. వాటికింద తన తల్లి తండ్రులున్నారని కొందరు భార్యపిల్లలువున్నారని కొందరు . రద్దీలో ఇరుక్కుపోయిన బంధువుల గురించే ఆలోచన విధ్వంసం సృష్టించిన భూకంపం శాంతించింది. అవని శాంతించిందని తెలిసిన ప్రజలు భూకంపపు దెబ్బనుండి తేరుకునేసరికి కొంచెం టైముపట్టింది.

కానీ కర్తవ్యం ఏమిటో తెలియరాలేదు. కర్తవ్యాన్ని గుర్తింపచేసినవాళ్ళు, ఆఇటికలు రాళ్ళు సున్నంకాంక్రీటు రద్దీలో ఇరుక్కున్న బంధువులు పిల్లలు , ముసలివాళ్ళు.

ఇక్కడ ఎవరి బంధువులని వాళ్ళు వెదుక్కోలేదు. ఎవరి భార్యల్ని వాళ్ళు మాత్రమే వెదుక్కోలేదు. ఎవరి పిల్లల్ని వాళ్ళు మాత్రమే రక్షించుకుందామనుకో లేదు. అలా అనుకున్నా వాళ్ళొక్కరే ఆపని చెయ్యలేరు. వాళ్ళకి ఆశక్తి చాలదు. పెద్దపెద్దవాళ్ళని కాంక్రీటు దూలాన్ని బరువుల్ని ఎత్తడం ఏ వొక్కరితరమూకాదు. అందుకే అందరూ కలిసారు. నడుంబిగించారు. వెతుకుతున్నారు.

ఎవరేనా వున్నారా, అని అడుగుతున్నారు. కానీ పేర్లు పెట్టి పిలవడం లేదు. ఎందుకంటే వాళ్ళకి, తెలిసిన పేర్లు భార్యది, పిల్లల్ది, తప్ప పక్కింటివాడి పేరుగాని వాడి వృత్తిగా తెలియని నాగరికత పెంచేసుకున్నాం. వాటి వాసన కూడా సోక్కుండా బలంగా గోడలు నిర్మించుకున్నాం. కానీ ఈ రోజు అవే కూలిపోయాయి. వాటికింద మనల్ని నలిపేసాయి. ఇప్పుడు ఎవరు ఎవర్ని కాపాడుతారు అన్నది కాదు ప్రశ్న... ఎవర్నేనా కాపాడగలమా? అన్నదే తాపత్రయం అందరిలోనూ వుంది!

ఇద్దరేసి కలిసి ఎత్తలేని బండల్ని ఎత్తి పక్కకి పెడుతున్నారు. కన్నాలు చేస్తున్నారు. ఎవరేనా ఇరుక్కున్న వాళ్ళని బైటకితీసి నప్పుడు నువ్వెవరు? నీ పేరేమిటి? ఎవరికి  భార్యవు? ఎవరికి తల్లివి? ఎవరికి తండ్రివి? ఎవరికి పిల్లవు? అని అడగడం లేదు రక్షించామన్న తృప్తి, ఆనందం వాళ్ళల్లో కనిపిస్తోంది. రక్షించాలనే పూనకం పూస్తోంది. అదే వాళ్ళని ప్రేరేపిస్తోంది... వెదికిస్తోంది. రక్షించారు. ...రక్షిస్తున్నారు. ....ఎప్పటికేనా సహాయం వస్తుందని ఆశిస్తున్నారు.

తాము ఎలా అయితే తనవాళ్ళు కాకపోయినా రక్షిస్తున్నారో, ఎక్కడో ఎవరో తన వాళ్ళని కూడా రక్షిస్తారనే ఆశ కొట్లాడుతోంది. అందులో నిరాశ కలగదు. అనే నమ్మకంతో రక్షిస్తున్నారు.

దాహం అలసట మరచి వెదుకుతున్నారు. వొకర్ని వొకరు హెచ్చిరించుకుంటూ... జాగ్రత్త చెప్పుకుంటూ... వెదుకుతున్నారు. కానీ రద్దీ లోపల ఇరుక్కుపోయిన వాళ్ళని రక్షించాలంటే.. మనిషి బలం చాలదు.

పెద్దపెద్ద కాంక్రీటు దూలాలు పక్కకి తోయాలంటే క్రేసులు కావాలి, ఆ దూలాన్ని ముక్కలు చెయ్యడానికి కట్టర్స్ కావాలి వాటిలో వొంగిపోయిన వూసలు కట్ చెయ్యడానికి గేస్ కట్టర్స్ కావాలి, బైటకి తీసిన వాళ్ళకి కానీ తీస్తున్న వాళ్ళకి కానీ తాగడానికి నీళ్ళు కావాలి.

మరో చోట

సెక్రటరీలు... సలహాదారులు... మంత్రులు... రాజకీయపండితులు... కూర్చుని ముఖ్యమంత్రికి సలహా ఇస్తున్నారు. ఇంత పెద్దభూకంపం వచ్చినప్పుడు లక్షమంది ప్రజలేనా పోయుండచ్చు..!   అబ్బెఅంత వుండకపోవచ్చు!

అంత వున్నా లేకపోయినా అలా చెప్పడం మంచిది సహాయం అందుతుంది. ఎక్కువ సహాయం కోసం అడగవచ్చు. ఈ నష్టం పూడ్చాలంటే... ఎక్కువ సహాయం అయితేనే బావుంటుంది.

ఎన్నో తర్జనబర్జనలు. ఏ విషయం ఎవరికీ తెలీదుకాబట్టి అంచనా ఎక్కువ చెప్తే ఎక్కువ సానుభూతి పొందచ్చు. అన్న నిర్ణయం... చీఫ్ మినిష్టరు మీడియా ముందుకొచ్చి నష్టాన్నిచెప్పాడు. మీడియా వింది. ఆ నష్టాన్ని చీఫ్ మినిష్టర్ పేరుమీద ప్రచారం చేసి పెద్దపెద్దఅక్షరాల్లో వేసింది. కిందని ఎవరో తెలియని రాజకీయనాయకుడి పేరు రాసి ఈ చీఫ్ మినిష్టరుకి అంచనా వెయ్యడం కూడారాదు. ఎపి సెంటర్ వున్న వూళ్ళల్లో అందరు ప్రజలూ చచ్చినా ఆ ఫిగరురాదు. ఇలాంటి అంచనాల వల్లే ఆ పార్టీ పరువు పోతోంది, అంటూ రాసింది.

ప్రజలు కంఫ్యూజన్ లో పడ్డారు.

అన్నీ రడీగా వున్నాయి. వాటిని ప్రజలకందించడంలో గవర్నమెంటు విఫలం చెందుతోంది. అంటూ చేతులు దులిపేసుకుంది ప్రధాన ప్రతిపక్షం. పేపర్లు అమ్ముకునే వాళ్ళు ఈ రెండు నిజాలు ఢంకా బజాయించి మరీరాసి. పేపర్లమ్మేసుకున్నారు.

ప్రజల్లో భయాందోళనలకి కారణం చీఫ్ మినిష్టర్ ప్రకటన. వాడి తెలివి తక్కువే కారణం, ఎందుకంటే ఎపిసెంటర్ కేంద్రీకరించిన ప్రదేశంలో వున్న వూళ్ళల్లో జనాభాకి , చీఫ్ మినిష్టర్ ప్రకటనకి ఎక్కడా పొంతన లేదని ప్రజలకి అర్థం అయింది.

చాలామంది బ్యూరోక్రాట్స్. చీఫ్ మినిష్టర్ ని రిఫర్ చెయ్యందే ఏ పనీ చెయ్యకూడదు అన్న ఆంక్షలతో కోపంతో వున్నారేమో పక్కకి తిరిగి నవ్వుకున్నారు.

చీఫ్ మినిష్టర్ ప్రకటనలో డొల్ల బైటపడకముందే, గవర్నమెంటు ప్రజల మేలుకోరే దానిగా, ప్రజలే ముఖ్యం అన్న ప్రాతిపదిక మీద ఏర్పడ్డట్టు కనిపించాలనే తాపత్రయంలో చేసిన తప్పు సరిదిద్దాలని, మరో నలభైఎనిమిది గంటల్లో మళ్ళీ భూమి కంపించవచ్చు అప్రమత్తంగా వుండండి. అంటూ ప్రజలని హెచ్చరించింది.

దాంతో అంతోఇంతో తేరుకుంటున్న ప్రజలు భయభ్రాంతులై మళ్ళీ వీధుల్లోకి వచ్చేసారు. వాళ్ళని ఆదుకోడానికి సౌకర్యం, రక్షణ కలిగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. దాంతో ప్రజలకి ప్రభుత్వం అంటే చిరాకేసుంటుంది.

ప్రభుత్వం ఏం చెయ్యాలి ఏం చేస్తే అస్తవ్యస్తమై ప్రజాజీవితం వొక గాడీలో పడుతుంది. అన్న తర్జనబర్జనలో చీఫ్ మినిష్టర్ భజనపరులు వుంటే!

మరోచోట.

స్టేట్ హైవే నలభైరెండు మీద వాహనాలు ఆగిపోతున్నాయి వొకదాని తర్వాతవొకటి... ఒక ట్రక్ లో దుప్పట్లు ఇంకో ట్రక్ లో వాటర్ పేకెట్స్ ...ఇలా చాలా ట్రక్కులు వాటిలో సేవకలు వాలంటీర్సరూపంలో జీతభత్యాలులేని సేవకులు రోడ్డు ఎప్పుడు క్లియర్ అవుతుందా? ఎప్పుడు భూకంపం ప్రాంతానికి వెళతాం? ప్రజలకి సాయం అందిస్తాం! అని ఎదురుచూస్తున్నారు.

వీళ్ళకి వెనగ్గా ఆర్మీట్రక్ లు ఏడో ఎనిమిదో వచ్చి ఆగాయి. వాటిలోంచి యాభైమంది దాకా సైనికులు దిగారు. రోడ్డుబ్లాకు అయింది. అక్కడ రోడ్డేలేదు. రోడ్డు చీలిపోయింది. రోడ్డుకి అడ్డంగా రాళ్ళు మట్టి గుట్టగా పోసివుంది. అది తొలిగితే గానీ, ఈ ట్రక్కులు చేరుకోవలసిన వూర్లు చేరుకోవు. ఎవరు ఈ మట్టిని రాళ్ళని తీస్తారు. అని ఎదురుచూస్తున్నాయి ట్రక్కులు. ఇవన్నీ చూసిన సైనికులు వెనక్కి ట్రక్కు దగ్గరకి వెళ్ళి పారలు గునపాలు పట్టుకొచ్చారు రోడ్డు అడ్డంగా వున్నమట్టి , రాళ్ళు తియ్యడం మొదలుపెట్టారు... వాళ్ళు మొదలుపెట్టి అరగంటకి వాలంటీర్స్ కి తట్టింది, అదికూడా తమ పనే అని అందరూ అందుకున్నారు. రోడ్డుకు అడ్డంగా పడ్డరాళ్ళు తప్పుకున్నాయి. మట్టి తప్పుకుంది. వాహనాలు వుత్సాహంగా ముందుకికదిలాయి. ఎంతదూరం వెళ్ళాయి. ఓ రెండుకిలోమీటర్లు మళ్ళీ అదే సమస్య. ఈసారి నీరు రోడ్డుమీద నీరు ప్రవహిస్తోంది. పైపు లైనుకి పడ్డ కన్నం వల్ల నీరు పైపుల్లోంచి బైటికి వచ్చి, రోడ్డుమీద నిలబడిపోయింది. వెంటనే సైనికులే రంగంలోకి దిగారు. వాళ్ళస్పెషలు వాహనాలని ముందుపెట్టారు. మామూలుగా రిలీఫ్ పట్టుకొస్తున్న వాహనాల ఇంజన్లు ఆపేసారు. స్పెషలు వాహనాల ద్వారా ఆ నీటిలోంచి ఇటుపక్కనుండి అటుపక్కకి లాగేసారు. మామూలు వాహనాల ఎక్జాస్ట్ పైపులు నీటిలో మునిగినా ఏ బాధా లేకపోయింది.

మరోచోట

అలాంటి బాధే ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు చీఫ్ ఇంజనీర్లకి ఎదురైంది. ఎపిసెంటర్ వచ్చినచోట, చుట్టుపక్కల ఎంతవరకూ ఎలక్ట్రిసిటీ లైన్లు పాడయాయి. ఎక్కడెక్కడ గ్రిడ్స్ పనిచెయ్యడం లేదు అన్నది తెలుసుకోవాలి. తెలుసుకు అవి రిపేర్ అవుతాయా అవవా, అయితే వాటికి ఎంత ఖర్చవుతుంది. ఎంతమంది లేబర్ కావాలి ఎలా ఎరేంజ్ చెయ్యగలం మెటీరియలు, మెన్, ప్లానింగ్ చెయ్యాలి అమలుపరచాలి. ఎంతోమందికి ఎన్నో ఆలోచన్లు వుంటాయి. అవన్నీ కలుపుకుపోవాలా, ఇవన్నీ చెయ్యడానికి టైముందా అతని ఆలోచనల్లో ఈ ఎపిసెంటర్ చుట్టుపక్కల ఎన్నోఇళ్ళు కూలిపోయుంటాయి. రోడ్లు పాడయివుంటాయి. ఎలక్ట్రిక్ స్థంబాలు కూలిపోయుండచ్చు. ఇవన్నీ క్లియర్ చెయ్యాలి, చెయ్యాలంటే మనుషులు సరిపోరు. పెద్దపెద్దమిషన్స్ కట్టర్స్ , క్రేన్స్, ఎర్త్ మూలింగ్ ఎక్విప్ మెంటు, దోజర్స్ దంపర్స్ పనిచేస్తాయి. అవి పని చెయ్యాలంటే కనీస సౌకర్యం ఎలక్ట్రిసిటీ ఎన్ని గ్రిడ్ డౌన్ అయాయో తెలుసుకురమ్మన్నాడు.

ఆ సమాచారం మూడుగంటల్లో వచ్చేసింది. అతని వుద్దేశం ఎక్కడవరకూ గ్రిడ్స్ పనిచెయ్యడం లేదో వాటిని పక్కకి పెట్టి , పనిచేసిన గ్రిడ్ నుండి కొత్తకేబులు వేసెయ్యడమే...

ఇన్ ఫర్మేషను వచ్చేసరికి కేబులు వెయ్యడానికి మనుషులు కేబులు సిద్ధంగా వున్నాయి. కానీ వచ్చిన ఇన్ ఫర్మేషను బట్టి పని అంత తేలికదికాదు. అని తేలింది. అందరికీ చూచాయగా తెలిసింది. ఎంతకేబులు వెయ్యాలో అని అందరూ ఆశ్చర్యపోయారు. సాధ్యం కాదన్నారు... వెర్రిపని అన్నారు.

అలా ఆలోచించనిది చీఫ్ ఇంజనీరుమాత్రమే అతనికి 165 కిలోమీటర్ల కేబుల్ వెయ్యాలి అని తెలియగానే గుండె గుభేల్ మంది. కానీ మరోదారేది, ప్రస్థుతం ఆలోచించడానికి కూడా వ్యవదిలేదు.

కేబుల్ వెయ్యడం మొదలుపెట్టండి అన్నాడు. కేబుల్ వెయ్యడం మొదలైంది ఎవరి మనసుల్లోనూ ఈ పని ఎన్నాళ్ళకి పూర్తవుతుంది 165 కిలోమీటర్ల కేబులు అంటే మాటలా, అన్న ఆలోచన్లతో ఒకటి రెండు గంటలు గడిచినా రెండుగంటల తర్వాత ఈ పని మనకి కొత్తకాదు. పని చేస్తుంటే కాలం తెలీదు. పూర్తిచేస్తున్నాం అన్న ధైర్యం చేకూరింది. కేబులు వెయ్యడం జరిగింది. కేబులు ఎపిసెంటర్ వున్న వూరికి చేరడానికి మూడురోజులు పట్టింది.

అప్పటికి గవర్నమెంటు ట్రోమానించి తేరుకుంది. జరిగిన నష్టం కథల కంప్యూషను వదిలించుకుంది. ఎపిసెంటర్ గుర్తించిన ప్రాంతాల నుండి సమాచారం సజావుగా రావడం మొదలైంది. వస్తున్న సమాచారం పాలకుల గుండెల్లో గుబులు పుట్టించింది. ప్రభుత్వం ఏం చెయ్యాలో అర్థం అయింది. ఆరుగురు మినిష్టర్లని, భూకంపం ప్రాంతానికి చెందిన పదిమంది ఎమ్మెల్యేలు, ఏ ఎఫెక్ట్ లేని ప్రాంతం నుండి పది ఎమ్మెల్యేలని కమిటీ కిందవేసింది. భూకంపం ప్రాంతంలో ఎమ్మెల్యేలు ఏవేవి కావాలో ఎక్కడెక్కడకి తీసుకెళ్ళాలో ఎలా తీసుకెళ్ళాలో చెప్పారు.

భూకంప ప్రభావితం కాని ప్రాంతంలో ఎమ్మెల్యేలు వాటిని తమ ప్రాంతంలో సేకరించడం మొదలుపెట్టారు. మూడువందల ట్రక్కులు డైవర్ట్ చేసారు. కొన్ని ట్రక్కుల్లో కర్ర, అయిదువందలకిపైగా టెంట్ లు , ఒక లక్ష బిస్కెట్ పేకెట్స్, వీట్ పౌడర్, బ్లాంకెట్స్... ఏవేవి కావాలనుకుంటున్నారో... ఏవేవి ఇవ్వగలం అనుకొంటున్నారో... అన్నీ పట్టుకు బయలుదేరారు. ఇవన్నీ బతి కున్న వాళ్ళకి!

చనిపోయినవారికి రెండువేలతెల్లటికఫన్ క్లాత్స్ వాళ్ళని కాల్చడానికి ఫైర్ వుడ్... వాళ్ళని కాల్చడానికి రెండువేలమంది వాలంటీర్లు, బతికున్నవాళ్ళకి సాయం అందించడానికి వో అరవైమంది డాక్టర్లు కలరా, మలేరియా వ్యాపించకుండా మందులు అన్నీ సమకూర్చుకు భూకంపపీడితుల్ని ఆదుకోడానికి బయలుదేరారు.

కానీ భూకంపం వచ్చిన నాలుగోరోజుకి మాత్రమే ఇది సాధ్యం అయింది.

...............................................................

భూమి కంపించింది. ఆ ప్రకంపనలకి ఇళ్ళు కూలిపోయాయి. రోడ్లు తెగిపోయాయి. కాలువలు మూసుకుపోయాయి. కూలిపోతున్న ఇళ్ళనుండి తప్పించుకున్నది కొందరు, తప్పించుకోలేక ఆ రాళ్ళ గుట్టలో ఆహుతియిపోయింది కొందరు. రాళ్ళగుట్టలో ఇరుక్కుపోయి కాళ్ళు చేతులు విరిగిపోయి ఎవరేనా సహాయం చేస్తే బతకగల ఆశతో కొందరు ఎందరో పీడితులు.

తప్పించుకున్నవాళ్ళకి ఏం మిగిలింది. గాభరాలో పిల్లలు పరిగెత్తి తప్పించుకుంటే తల్లి తండ్రి రాతిశిధిలాల్లో ఇరుక్కుచనిపోయారు. భర్త తప్పించుకుంటే... భార్య, భార్య తప్పించుకుంటే భర్త... తలితండ్రులు తప్పించుకుంటే కొడుకులు... ఎవరు తప్పించుకున్నారో... ఎవరు చనిపోయారో ఎవరికీ తెలీదు. బతికున్నవాళ్ళు ఆకాశం కింద..., ఏం జరిగింది? ఇంకేం జరుగుతుంది. దాహానికి ఆకలికి భూకంపం గురించి తెలీదు. భూకంప పీడుతులమీద జాలికూడా లేదు.

భూకంపం వచ్చిందని సమయం ఆగలేదు. కాలం గడుస్తూనే వుంది. కాని పొద్దున్నే పోయి నీళ్ళు తెచ్చుకుందుకు కొళాయిలు లేవు. నెత్తిమీద వుండవలసిన కప్పు నేల మీదుంది.

షాపుకెళ్ళి కొనుక్కోడానికి షాపు తెరవడు. తెరవడు కాదు షాపువుందో కూలిందో షాపువాడు వున్నాడో పోయాడో మనసు దిగ్భ్రాంతి నుండి తేరుకుంది. శరీరం నీరసపడిపోతోంది. తినడానికో... తాగడానికో... ఏదో ఒకటి కావాలి. అవన్నీ వాళ్ళే కూర్చుకోవాలి. ఎవ్వరూ ఇవ్వకూడదు. పిల్లలకి కూడా అదే సంస్కారం నేర్పుతారు. ఎవరేమిచ్చినా పుచ్చుకోకూడదు.

ఎవరో ఇవ్వడం మనం పుచ్చుకోడం చాలా తక్కువకింద చూస్తారు. చిన్నతనం ఫీలవుతారు. భూకంపం ఎక్స్ పీరియన్స్ జీవితంలో మళ్ళీమళ్ళీ రాదు కానీ ఇప్పుడు తనుకూడా భూకంపం పీడితుడు జీవితం అస్తవ్యస్తం అయింది అన్నది అర్ధం అవుతుంది. కానీ తన వొక్కడిదే కాదు తన పక్కవాడిది తనవీధిలో వాడిది, తన పేటలోవాడిది తన వూరులో వాడిది మొత్తం వూరు వాడ జీవితం తుడిచి పెట్టుకుపోయింది. అన్న విషయం అర్ధం కాదు, మనసుకి పట్టదు.

రేపేం చెయ్యాలి అన్న విషయం తనకే కాదు వూరిని ఏలేదొర్లకి గానీ, రాష్ట్రాన్ని ఏలుతున్న పాలకులకికాని, దేశాన్ని నడిపిస్తున్న నాయకులకి కానీ ఎవరికీ తట్టదు అంతా కన్ ఫ్యూషనే! దాన్నించి బయటపడ్డ, సహాయం అందించాలని తట్టడం, ఏ సహాయం అందించాలో ఎంత సహాయం అందించాలో అంచనా వేయడంలో చాలా కన్ ఫ్యూషన్ వుంటుంది.

ఆ కన్ ఫ్యూషన్ నుండి బైటపడేసరికి మూడురోజులు పట్టింది. అంటే సహాయం పీడితులకెళ్ళేసరికి అయిదోరోజు వచ్చేసింది. ఈ నాలుగురోజులు ఆకలి, నీరసం, దాహం వీటిని తీర్చుకోడం ఎలాగో తెలియని నిస్సహాయతతో పీడితులు వున్నా....

వచ్చిన సహాయాన్ని స్వీకరించడానికి, ఫుడ్ పేకేట్స్,(ఆహారం పొట్లాలు ) బిస్కెట్ పేకెట్స్, తీసుకోడానికి వెనుదీసారు.. చిన్నతనం చెందారు అంటే వాళ్ళ ఆటిట్యూడ్స్ లో మార్పురాలేదు. వొక్కరాత్రిలో రాలేదు వో భూకంపం తేలేదు.

అతన్ని చూసి జాలేసి నాలుగు బిస్కెట్ పేకెట్స్ ఇచ్చాను. అతను వొకటి తీసుకు మూడువెనక్కి ఇచ్చేసాడు. ఆ వొక్కటీకూడా తన చిన్న కూతురికోసం అని చెప్పాడు. అది విన్న తర్వాత వాడు కాదు ఏడ్చింది నేను.

ఎందుకు పుచ్చుకోరు ఎంతో దూరం నుండి ఎన్నో ప్రయాసల కోర్చి ఎంతో డబ్బు పెట్టి ఇంత సహాయం చేస్తే పుచ్చుకోరేం పొగరా, ఎవడికి పొగరు, నువ్వెందుకు సాయం చేసావ్ నా బంధువని చేసావా, పేరుకోసం చేసావా అయినా నీ వెందుకు చేసావ్ అన్నది పక్కకిపెట్టి నువ్వుచేసినంత మాత్రాన వాళ్ళు తీసుకోవాలా అన్న ఆలోచనే వాళ్ళని బతిమాలించేటట్టు చేసింది. ఆహారం పొట్లాలు, బిస్కెట్టు పేకెట్లు, నీటిపేకెట్లు వాళ్ళకి బతిమాలి బామాలి అందించారు. ఎందుకు? ఆ పరిస్థితి అలాంటిది కాబట్టి. మీ కర్మకి మీరు చావండి. అని అనలేదు. తింటే తినండి లేకపోతే పోండి అనే లోకం పోకడ మించిన మానవత్వం మనుషులకి అవసరం అది అక్కడ కావాలి.

మనుషులు ఆ ఎత్తుకు ఎదగలేరా ఎందుకు ఎదగలేరు ఎదగగలరు అవసరాన్ని బట్టి మనిషిలో మని తగ్గి, షి, పెరుగుతుంది. దయ, ఆప్యాయత, బతిమాలైనా ఎదుటిమనిషికి, కంఫర్ట్, కలిగించాలనే తపన వొక్కతల్లిలో (షి) వుంటాయి. అందరికీ ఆ ఎత్తుకి ఎదిగే అవసరం, ఆ గుణం అవసరం అయాయి.

అందుకే బతిమాలుతు వున్నారు. వొకటికి రెండు పేకెట్లు అందచేస్తున్నారు. వాళ్ళు చెప్పే కధలు వింటున్నారు.

అక్కడి మనుషులంతా, శూన్య, స్థితికి చేరుకున్నారు. ఆర్ధికంగా మానసికంగా సాంఘికంగా, శూన్యం, లేకపోతే రాళ్ళగుట్టల్ని తొలగిస్తున్న సావన్ కి, దూరంగా తొలగిస్తున్న రాళ్ళగుట్టలమధ్య ఎర్రటి చీరకనబడింది. ఆ చీర ఎవరిదో తెలుసు, ప్రజలకి శరీరాలు కనబడడంతో అందరూ అక్కడ గుమికూడి రాళ్ళు తప్పించడం ముమ్మరం చేసారు. సావన్ కూడా వెళ్ళాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది. మనసులో ఉద్వేగంకాని, ఆవేశంకాని.. ఆక్రోశంకానీ ఏవీలేవు. అంతా శూన్యం... మెకానికల్ గా ఇనపరాడ్లని, సిమెంటుడస్ట్ ని ఇటుకల్ని తొలగిస్తున్నారు.

ఆ శవంతో పాటు చాలా బైటకి వచ్చాయి. అన్నీ వరసగా పడుకోపెట్టారు. కొంతమంది వచ్చి కొన్నింటిని తీసుకెళ్ళిపోయారు. సావన్ వంతు వచ్చేసరికి అక్కడ వోలంటీర్లు తప్ప ఇంకెవరూ లేరు.

సావన్ చూస్తున్నవేపే వోలంటీర్ కూడా చూసాడు. కాలవగట్టు దగ్గర కర్రలున్నాయి అన్నాడు. సావన్ భార్య శవం కాలువగట్టుకి చేరింది. కర్రలు పేర్చడంలో సాయంచేసాడు వోలంటీర్... అతనే కర్రకి నిప్పంటించి ఇచ్చాడు. సావన్ శవానికి నిప్పంటించాడు. అంటిస్తూ గొణుక్కున్నాడు, మోసం! అని ఏమిటీ మోసం? ఎవరు చేసారీ మోసం? నిన్నటి జీవితం వేరు ఈ రోజు బతుకువేరు.

..............................

రేపేమిటి

చనిపోయిన వాళ్ళకి అఖ్ఖరలేని ప్రశ్న?........... సావన్ ని వెంబడించి పీడించింది.

సావన్ ఆలోచన్లో వుండగానే వాలంటీర్ మరో శవాన్ని కర్రల మధ్య పేర్చాడు. సావన్ అప్రయత్నంగా దానికి కూడా చేతిలో నిప్పు కర్రతోనిప్పు అంటించాడు.

తర్వాత

నిప్పు కర్ర పక్కనపెట్టి శవాన్ని తీసుకురావడం కోసం ఆ వాలంటీర్ వెనుక వెళ్ళాడు. వాలంటీర్ గా మారిపోయాడు.

కర్తవ్యం తెలుసుకున్నాడు.

(సమాప్తం)